

నాటి వరదకు సజీవ సాక్ష్యంగా మిగిలిన పులపత్తూరులో ఇళ్ల శిథిలాలు



మూడేళ్లవుతున్నా..

- అప్పుడెలా ఉందో. ఇప్పుడూ అలాగే
- అన్నమయ్య వరద ప్రభావిత ప్రాంతాల్లో కనిపించని కనీస సౌకర్యాలు
- రేపు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పర్యటన
- అన్నమయ్య బాధితుల్లో చిగురిస్తున్న ఆశలు

రాజంపేట, ఆగస్టు 21: అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి వేలాదిమంది నిరాశ్రయులై మూడేళ్లవుతోంది. ఇప్పటివరకు వారి బాధలు మాత్రం తీరలేదు. నాటి పాలకుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా ప్రాజెక్టు గేట్లు వెక్కిరిస్తున్నాయి. 2021 నవంబరు 19వ తేదీ తెల్లవారుజామున అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయింది. ఈ సంఘటనతో పులపత్తూరు, తొగూరుపేట, మందపల్లె, గుండ్లూరు, తాళ్లపాక, రామచంద్రాపురం గ్రామాలు పూర్తిగా నీటమునిగాయి. ప్రధానంగా పులపత్తూరు, తొగూరుపేట, మందపల్లె, రామచంద్రాపురం పూర్తిగా వరద పాలయ్యాయి. 40మంది పైబడి మృత్యువాతపడ్డారు. 450 ఇళ్లు కొట్టుకుపోయాయి. రాజంపేట, నందలూరు, పెనగలూరు చెయ్యేరునది పరీవాహక ప్రాంతాలైన అన్నమయ్య ప్రాజెక్టు దిగువన ఉన్న వందలాది గ్రామాలు పూర్తిగా నీటిపాలయ్యాయి. వేలాది ఎకరాల భూమి వ్యవసాయానికి పనికిరాకుండా ఇసుకమేటలు వేసింది. వేలాది పశువులు అశువులు బాశాయి. అప్పటి సీఎం జగన్ సొంత జిల్లాలో ఇంత ఘోర విపత్తు జరిగినా ఆయన మొక్కుబడిగా వచ్చి వెళ్లారే తప్ప ఇచ్చిన హామీలు నేటికీ ఏ ఒక్కటీ నెరవేరలేదు.

ప్రధానంగా ఈ ప్రాజెక్టు తెగిపోయిన తర్వాత ముఖ్యమంత్రి హోదాలో జగన్ అక్కడికి వచ్చి అన్నమయ్య ప్రాజెక్టు బాధితులను అన్నివిధాలా ఆదుకుంటామని, వారికి పక్కాఇళ్లు వెంటనే కట్టించి ఇస్తామని అన్నారు. ఇసుకమేటలు తొలగించి వ్యవసాయ భూములను బాగు చేసి రైతులకు అప్పగిస్తామని, వారికి పంట రుణాలు అందజేస్తామని, పునరావాస గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్లను, మంచినీటి సౌకర్యాన్ని, విద్యుత్ సౌకర్యాన్ని ఇతర మౌలిక సదుపాయాలు సత్వరం ఏర్పాటు చేస్తామని, ఈ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామని, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని... ఇలా ఎన్నెన్నో హామీలు గుప్పించినా ఏ ఒక్కటీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు.

అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయిన మూడేళ్లకు ప్రభుత్వం మారింది. శుక్రవారం ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్టును పరిశీలించడంతో పాటు ముంపుబాధిత గ్రామాల్లో పర్యటించనున్నారు. దీంతో మూడేళ్లుగా ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఎటువంటి ఆదరణ లేక అనాథలుగా మారిన ఈ ప్రాంత ప్రజలు నేడు గంపెడాశతో నూతన ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరిస్తుందని ఎదురుచూస్తున్నారు.

ఇవీ ప్రధాన సమస్యలు

- ప్రాజెక్టు తెగిపోయినప్పుడు పులపత్తూరులో ఎక్కువ ఇళ్లు కొట్టుకుపోయాయి. ఆ తర్వాత తొగూరుపేట, మందపల్లె, రామచంద్రాపురం గ్రామాల్లో ఇళ్లు దెబ్బతిన్నాయి. వీరికి మూడు నెలల్లో ఇళ్లు కట్టిస్తామన్న జగన్ ప్రభుత్వం రెండేళ్ల తర్వాత ప్రత్యేక ప్యాకేజి కింద ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ఆ ఇళ్లు నేటికీ పూర్తి కాలేదు.
- అన్నమయ్య ప్రాజెక్టు దిగువ ప్రాంతం ఏడాదికి మూడు పంటలు పండుతూ పచ్చని పంటలతో అలరారుతూ కోనసీమగా పిలువబడేది. ప్రాజెక్టు తెగిపోవడంతో ఈ భూములపై ఇసుకమేటలు చేరి ఎడారిగా మారిపోయాయి. ఇప్పటికైనా ఇసుకమేటలను పంట పొలాల్లో తొలగించి ఆ భూములను సాగు యోగ్యంగా మార్చాల్సి ఉంది.
- వరదలో 40 మందికి పైబడి చనిపోయారు. ఈ కుటుంబాల్లో 11 మందికి పైబడి చిరుద్యోగాలు కల్పించారు. మిగిలిన కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాల్సిన అవసరం ఉంది.
- ప్రాజెక్టు తెగిపోయినప్పుడు ఈ ప్రాంతాల్లో నాటి ముఖ్యమంత్రి జగన్ పర్యటన సందర్భంగా తాత్కాలికంగా కంకర రోడ్లు వేశారు. ఇంతవరకు ఏ గ్రామానికి రోడ్ల సౌకర్యం కల్పించలేదు. అరకొర విద్యుత్ సౌకర్యం కల్పించినా పూర్తిస్థాయిలో ఇళ్లకు, వ్యవసాయ పంపుసెట్లకు కరెంటు సౌకర్యాన్ని ఏర్పాటు చేయలేదు. ప్రత్యేక ప్యాకేజి కింద ఈ ప్రాంతానికి కరెంటు సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలి.
- ఇక్కడ వేలాదిగా పశుసంపద ఉండేది. ఈ పశువులంతా పూర్తిగా నీటిపాలయ్యాయి. తిరిగి పాడి రైతులకు పశుసంపద ఏర్పాటు చేసుకోవడానికి బ్యాంకుల ద్వారా ప్రత్యేక రుణాలు ఇప్పించాలి.
- భారీ వరద వల్ల మందపల్లె, తొగూరుపేట, రామచంద్రాపురం, గుండ్లూరు ప్రాంతాల్లో ఉండే జగతి కట్టలన్నీ కొట్టుకుపోయాయి. తద్వారా ప్రాణనష్టం జరిగింది. వర్షాకాలం మొదలైంది. వరద వస్తే తిరిగి ఈ గ్రామాల్లోని నీరంతా ప్రవహించి భారీఎత్తున ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంది. వెంటనే నదికి ఆనుకుని ఉన్న ఈ ప్రాంతాల్లో జగతికట్టలు (రక్షణ గోడలు) ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.
- ఈ ప్రాంతంలో వ్యవసాయం కుంటుపడినందున ప్రత్యేకంగా ఉపాధి హామీ పథకాలను ఎక్కువగా నిర్వహించి ప్రజలు వలస పోకుండా ఆదుకోవాల్సి ఉంది.
- ఇంత భారీఎత్తున విపత్తు జరిగి అన్నివిధాలా నష్టపోయిన వీరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇకనైనా దీనిని జాతీయ విపత్తుగా గుర్తించి ప్రత్యేక సహాయ నిధి కింద ఆదుకోవాలి.



వైసీపీలో ప్రక్షాళన

- జిల్లా అధ్యక్షుడుగా జగన్ మేనమామ, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి
- కమలాపురం ఇన్‌చార్జిగా నరేన్‌రామాంజులరెడ్డి
- జడ్పీ చైర్మన్‌గా బి.మఠం జడ్పీటీసీ రామగోవిందరెడ్డి
- ప్రలోభాలకు లొంగకండి ● పులివెందుల ఎమ్మెల్యే, మాజీ సీఎం జగన్
- ఏకపక్షంగా జడ్పీ చైర్మన్‌ను ఖరారు చేయడంపై జడ్పీటీసీల కినుక
- వైసీపీలో డబ్బుకే ప్రాధాన్యత అంటూ మరోసారి రుజువైందంటూ ఆవేదన
- తాడేపల్లిలో జడ్పీటీసీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో జగన్ మంతనాలు

సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి జిల్లావాసులు మైండ్ బ్లాక్ అయ్యే రిజల్ట్ ఇచ్చారు. మాది సొంత జిల్లా, ఇక్కడ మాకు అడ్డే లేదంటూ ఐదేళ్లలో జగన్ అండ్ కో జనాలను గాలికొదిలేశారు. కొందరికి మాత్రమే వైసీపీ నేతలు ప్రాధాన్యం ఇచ్చేవారు. అభివృద్ధి బదులు కబ్జాలు, దందాగిరి చేయడంతో గూబగుయ్యిమనే రిజల్ట్ ఇచ్చారు. రెండు నెలల తరువాత వైసీపీలో మళ్లీ కదలిక వచ్చింది. జడ్పీ పీఠాన్ని ఎక్కడ టీడీపీ లాగేసుకుంటుందోనన్న భయం జగన్‌కు పట్టింది. అంతే.. ఒక్కసారిగా జడ్పీటీసీలు, వైసీపీ నేతలు జగన్ అండ్ కోకు గుర్తుకు వచ్చారు. పీఠం చేజారకుండా ఉండేందుకు తాడేపల్లి ప్యాలెస్‌లో పులివెందుల ఎమ్మెల్యే, మాజీ సీఎం జగన్ కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, రఘురామిరెడ్డి తదితరులతో భేటీ అయ్యారు. చాన్నాళ్ల తరువాత జడ్పీటీసీలు ఇతర ముఖ్యనేతలతో జగన్ మాట్లాడారు. ఈ సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షులను మారుస్తూ పార్టీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు.

(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ వైసీపీ చేతుల్లోనే ఉంది. నిన్నటి దాకా చైర్మన్‌గా అమరనాథరెడ్డి పని చేశారు. ఈయన రాజంపేట ఎమ్మెల్యేగా గెలుపొందారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారం చేపట్టింది. ప్రొద్దుటూరులో ఇప్పటికే పలువురు కౌన్సిలర్లు జగన్‌కు బైబై చెప్పి సైకిలెక్కేశారు. ఇక జడ్పీ పీఠం కూడా టీడీపీ స్వంతం చేసుకుంటుందన్న భయం ఇటీవల జగన్ అండ్ కోలో పుట్టిందంటారు. సొంత జిల్లాలో జడ్పీ పీఠం చేజారితే దాని ప్రభావం రాష్ట్రవ్యాప్తంగా పడుతుంది. పార్టీకి తీరని నష్టమని భావించిన జగన్ అండ్ కో వెంటనే జడ్పీటీసీలు, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలతో బుధవారం తాడేపల్లిలో మంతనాలు జరిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బి.మఠం జడ్పీటీసీ సభ్యుడు ఎమ్మెల్యే టికెట్ ఆశించారు. "అయితే అప్పుడు టికెట్ ఇవ్వలేకపోయాను. జడ్పీ చైర్మన్‌గా ఖరారు చేస్తున్నాం. రేపు ఎన్నిక జరిగితే అందరూ కలిసికట్టుగా రామగోవిందరెడ్డిని ఎన్నుకోండి. ఇది మన సొంత జిల్లాలో జరిగే ఎన్నిక. మనం జాగ్రత్తగా ఉండాలి, మీ అందరికీ నేనుంటా" అంటూ జగన్ చెప్పారని అంటున్నారు.

పలువురు అసంతృప్తి

జిల్లాపరిషత్ చైర్మన్ పదవిని వైసీపీలో పలువురు ఆశించారు. జగన్ మేనమామ మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి కుమారుడు సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి, బిమఠం రామగోవిందరెడ్డి, కాశినాయన బీసీ సత్యనారాయణరెడ్డి తదితరులు ఈ పీఠాన్ని ఆశించారు. అయితే వీరందరి అభిప్రాయాలు తీసుకోకుండా జగన్ ఏకపక్షంగా రామగోవిందరెడ్డి పేరు ఖరారు చేయడాన్ని పలువురు జీర్ణించుకోలేదని చెబుతున్నారు. నరేన్ రామాంజులరెడ్డి అలిగినట్లు సమాచారం. దీంతో నరేన్‌ను బుజ్జగించి ఆయనకు కమలాపురం ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి కోపాన్ని చల్లార్చినట్లు చెబుతారు. అధికారం ఉన్నప్పుడు జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌ల అభిప్రాయం లేకుండానే ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు అధికారం కోల్పోయాక కూడా జడ్పీటీసీల అభిప్రాయాలు తీసుకోకుండా ఏకపక్షంగా ప్రకటించడాన్ని కొందరు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇంత సంబడానికి అంత దూరం తాడేపల్లికి రావాలనా అంటూ కొందరు నిష్టూర పోయారు.

డబ్బుకే ప్రాధాన్యత

వైసీపీలో హార్డ్‌కోర్ వైసీపీ కేడర్ అనేదానికన్నా డబ్బులకే విలువ ఇస్తారని ఆ పార్టీ నేతలు అంటుంటారు. 'జగన్ సీఎం కావాలని పార్టీ పెట్టినప్పటి నుంచి అహర్నిశలు కృషి చేసి జగన్‌ను సీఎం చేశాం. అయితే గద్దెనెక్కాక ఆయన పూర్తిగా మారిపోయారు. కార్యకర్తలకు దర్శనమే లేదు. డబ్బు ఉన్న వాళ్లకే పాలిటిక్స్ నడిచింది. ఇప్పుడు కూడా జడ్పీ చైర్మన్ ఎంపిక డబ్బే ప్రాధాన్యతగా జరిగింది' అంటూ ఆ పార్టీ నేతలు అంటున్నారు. జడ్పీ చైర్మన్‌కు నోటిఫికేషన్ వస్తే టీడీపీ బరిలోకి దిగితే ప్రజాప్రతినిధులను కాపాడుకునేందుకు డబ్బులు పెట్టాల్సి ఉంది. అయితే అధిష్ఠానానికి డబ్బు పెట్టే ఆలోచన లేదంటున్నారు. సొంత సభ్యులను కాపాడుకునేందుకు అవసరం బట్టి రూ.20లక్షలు ఇచ్చే ఆర్థిక స్థోమత ఉన్న వారినే ఎంపిక చేయాలని నిర్ణయించి కాంట్రాక్టరు, ఆర్థికంగా స్థితిమంతుడైన రాంగోవిందరెడ్డి పేరు ఖరారు చేసినట్లు వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.

టీడీపీ బరిలో ఉండాలి

2014-19 చంద్రబాబు హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసిన మాజీమంత్రి దివంగత వైఎస్ వివేకాను ఓడించి బీటెక్ రవి ఎమ్మెల్సీగా గెలుపొందారు. మళ్లీ ఈసారి జడ్పీ చైర్మన్ కోసం టీడీపీ అదే స్ట్రాటజీ ఫాలో అవుతుందని భయపడి ముందస్తు బుజ్జగింపు కార్యక్రమాన్ని జగన్ చేస్తున్నట్లు చెబుతున్నారు. వైసీపీ ప్రజాప్రతినిధులు కూడా.. నోటిఫికేషన్ వచ్చాక టీడీపీ పోటీలో ఉండాలని కొందరు భావిస్తున్నారు. ఇలా అయితే తమకు సిరుల పంట పండుతుందని లేకపోతే తృణమోఫణమో ఇస్తారని అంటున్నారు. జగన్ హయాంలో ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లించి జిల్లాపరిషత్, మండల పరిషత్, పంచాయతీలను నిర్వీర్యం చేశారు. కనీసం ఈ ఎన్నికలతో అయినా ఇప్పటిదాకా వారు పోగొట్టుకున్న సొమ్ము వస్తుందని భావిస్తున్నారు.



జిల్లా అధ్యక్షుడుగా మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి

ఇక కడప వైసీపీ జిల్లా అధ్యక్షుడుగా జగన్ మేనమామ, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డిని నియమించారు. ఇన్నాళ్లు సురేశ్‌బాబు జిల్లా అధ్యక్షుడుగా ఉన్నారు. ఆయన కడప మేయరుగా కూడా ఉన్నారు. ఇటీవల ఆయన అనారోగ్యానికి గురయ్యారు. యాక్టివ్‌గా లేరు. దీంతో ఆయనను తప్పించారు. జిల్లా అధ్యక్షుడుగా ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పేరు ప్రస్తావన వచ్చినప్పటికీ ఆయన అంత ఆసక్తి చూపలేదంటారు తానుండేది ప్రొద్దుటూరులో, రోజూ కడపకు రాలేను అని తిరస్కరించడంతో రవీంద్రనాథరెడ్డికి అధ్యక్ష బాధ్యతను కట్టబెట్టారు. ఇక కమలాపురం బాధ్యతలను ఆయన తనయుడు సీకేదిన్నె జడ్పీటీసీ సభ్యుడు నరేన్ రామాంజులరెడ్డికి అప్పగించారు. రవీంద్రనాథరెడ్డి కడప కార్పొరేషన్ మేయరుగా పనిచేశారు. కడప అసెంబ్లీకి పోటీ చేయాలనేది ఆయన కోరిక. అయితే గత 2014, 19, 24 ఎన్నికల్లో కడప పోటీచేసే అవకాశం దొరకలేదు. ఇప్పుడు జిల్లా అధ్యక్షుడు కావడంతో పూర్తి దృష్టి పెట్టి కడపలో పోటీ చేసేందుకు ఒక అవకాశం ఉందంటూ ఆయన అనుచరులు సంతోషపడుతున్నారు. నిన్నటిదాకా జిల్లా అధ్యక్షుడుగా బీసీ సామాజిక వర్గానికి చెందిన సురేశ్‌బాబు పనిచేశారు. ఇప్పుడు అనారోగ్యం పేరిట ఆయనను తప్పించారు. అనారోగ్యం సాకుతో పాటు సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ నేతలకు టచ్‌లోకి వెళ్లారన్న ప్రచారం వైసీపీ నేతల్లో ఉందంటారు. ఆయన స్థానంలో మరో బీసీ నేతనో లేక మైనార్టీకో ఇవ్వకుండా జగన్ మేనమామకు అధ్యక్ష పదవి ఇవ్వడం గమనార్హం. ఏదైనా మా వైసీపీ కుటుంబ పార్టీ అబ్బా.. అంతా మా సారోళ్లదే అంటూ కొందరు వైసీపీ నేతలు అంటుండడం గమనార్హం.



జగన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న బి.మఠం జడ్పీటీసీ రామగోవిందరెడ్డి

జగన్‌తో భేటీకి 33 మంది మాత్రమే హాజరు

కడప (రూరల్), ఆగస్టు 21: మాజీ సీఎం జగన్ తాడేపల్లెలో బుధవారం నిర్వహించిన భేటీకి ఉమ్మడి కడప జిల్లా నుంచి కేవలం 33 మంది జడ్పీటీసీ సభ్యులు మాత్రమే హాజరైనట్లు సమాచారం. జగన్ సీఎంగా ఉన్న సమయంలో 2021లో నిర్వహించిన జడ్పీటీసీ ఎన్నికల్లో వైసీపీ పెద్దలు అధికారాన్ని అడ్డం పెట్టుకుని అప్పటి ఉమ్మడి కడప జిల్లాలోని 50 జడ్పీటీసీ స్థానాల్లో 38 స్థానాలను ఏకగ్రీవం చేసుకున్నారు. మిగిలిన 12 స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా గోపవరం జడ్పీటీసీ స్థానాన్ని టీడీపీ గెలువగా ఇతర 11 స్థానాలు వైసీపీ ఖాతాలోకి వెళ్లాయి. దీంతో వైసీపీకి మొత్తం 49 జడ్పీటీసీ స్థానాలుండగా వీరిలో ఒంటిమిట్ట జడ్పీటీసీ రాజీనామా చేయగా పులివెందుల జడ్పీటీసీ మృతిచెందారు. మిగిలిన 47 మందిలో జగన్ భేటీకి 33 మంది మాత్రమే హాజరయ్యారని విశ్వసనీయ సమాచారం. కాగా.. జగన్‌తో భేటీకి వెళ్లిన జడ్పీటీసీ సభ్యుల సెల్ ఫోన్‌లను లోనికి అనుమతించలేదని అంటున్నారు. తమపై జగన్‌కు నమ్మకం లేనప్పుడు సమావేశానికి ఎందుకు పిలవాలని కొందరు జడ్పీటీసీలు గుసగుసలాడినట్లు తెలిసింది. అధికారంలో ఉన్నప్పుడు జగన్‌ను ఎలాగూ కలవలేకపోయామని ప్రతిపక్షంలోకి వచ్చిన తరువాత మొదటిసారిగా కలిస్తే ఆయనతో కనీసం సెల్ఫీలు కూడా తీసుకోవడానికి వీలులేకుండా తమ సెల్‌ఫోనులను బయటే ఉంచడం బాధేసిందని పలువురు జడ్పీటీసీలు వాపోయారు.

బాధ్యులపై చర్యలు తప్పవు : ఎమ్మెల్యే మాధవి



ఆసుపత్రిలో బాలుడికి అందుతున్న వైద్యచికిత్స గురించి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆర్.మాధవి, ఆర్.శ్రీనివాసరెడ్డి తదితరులు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 21: కడప నగరం బెల్లంమండీవీధిలో విద్యుత్ వైర్లు తగిలి బాలుడు మృతి చెందడం, మరోబాలుడు గాయపడటం బాధాకరమని కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ ఘటనపై పూర్తిగా విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. బుధవారం కడప నగరం బెల్లంమండీ వీధిలో ఇద్దరు బాలురు విద్యుత్‌షాక్‌కు గురైన చోటుకు వెళ్లి పరిశీలించారు. అలాగే ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న బాలుడి గురించి తెలుసుకుని, అతడికి అత్యవసర చికిత్స అందించాలని యాజమాన్యానికి సూచించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రమాదపుటంచుల్లో కడప నియోజకవర్గం ఉందన్నారు. విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ప్రజలకు అత్యంత ప్రమాదకరంగా మారాయని అన్నారు. పలుమార్లు విద్యుత్ అధికారులకు ఈ విషయం చెప్పామన్నారు. ప్రైవేటు వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్లను వారి స్థలాల్లో పెట్టుకోవాలని, రోడ్లపై పెట్టకూడదన్నారు. కడప నగరంలో ప్రతి ప్రాంతంలో ఈ పరిస్థితి ఉందన్నారు. దీనిపై పూర్తిగా విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్ వైరుకు జియో వైరు తగిలి ఓ బాలుడు మృతిచెందడం, మరో పిల్లవాడు పాక్షికంగా అంగవైకల్యం చెందడం బాధాకరమన్నారు. ప్రాణనష్టాన్ని పూడ్చలేం కానీ వారి కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. చికిత్స పొందుతున్న బాలునికి ఒక్క పైసా కూడా ఖర్చు కాకుండా వైద్యం అందించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ ద్వారానే ప్రమాదం : ఎస్ఐ

కడపలో జరిగిన విద్యుత్ ప్రమాదానికి ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైరే కారణమని టూటౌన్ ఎస్ఐ హుసేన్ తెలిపారు. "అమీన్‌పీర్ రోడ్డులో ఓ ప్రైవేటు వ్యక్తికి సంబంధించి 33/11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి రెండు ఎర్త్ వైర్లు తెగి వేలాడుతున్నాయి. ఎర్త్ వైరు కిందనే కేబుల్ వైరు కూడా తెగిపోయి వేలాడుతూ ఉంది. ఈ రెండు వైర్లు ఒకదానికి ఒకటి తగులుకున్నాయి. దీనికి తోడు ఆ కేబుల్‌కు ఉన్న సపోర్టు కమ్మి కూడా వేలాడుతోంది. ఆ సమయంలో వచ్చిన విద్యార్థులకు ఆ కేబుల్ తగలడంతో కరెంటు షాక్ తగిలింది" అన్నారు. కేవలం ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైరు కారణంగానే పిల్లలకు కరెంటు షాక్ తగిలి గాయపడ్డ తంజుర్ రెహ్మాన్ మృతి చెందాడని, మరో బాలుడు గాయపడ్డాడని పేర్కొన్నారు.

విషాదం నింపిన విద్యుత్



కడపలో విద్యుత్ షాక్‌తో కిందపడుతున్న విద్యార్థులు

- విద్యుత్ షాక్‌తో.. ముగ్గురు మృతి
- ఒకరికి తీవ్ర గాయాలు

జిల్లాలో వేర్వేరుచోట్ల విద్యుత్ షాక్‌తో ముగ్గురు మృతిచెందగా ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. కడప నగరంలోని బెల్లంమండీ వీధిలో నివాసం ఉంటూ రోజూ కలసి పాఠశాలకు వెళ్లి వచ్చే ఇద్దరు విద్యార్థులు.. బుధవారం మధ్యాహ్నం రోడ్డుపై వేలాడుతున్న కేబుల్ వైరు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. జమ్మలమడుగు మండలం రామిరెడ్డిపల్లెలో నీళ్ల కోసం స్విచ్ వేస్తుండగా ఒకరు.. మైలవరం మండలం నవాబుపేటలో నీళ్లకోసం మోటారు ఆన్ చేసేందుకు వైర్లు తగిలిస్తుండగా షాక్‌కు గురై మరొకరు మృతిచెందారు.

కేబుల్ తగిలి..

కడప (క్రైం), ఆగస్టు 21: కడప నగరంలోని బెల్లంమండీ వీధికి చెందిన అబ్దుల్ రెహ్మాన్ కుమారుడు తంజూరు రెహ్మాన్ (11), అజ్మత్ ఆలీ కుమారుడు షేక్ అదనన్ ఆలీ (11) స్నేహితులు. వీరిద్దరూ టూటౌన్‌లోని ప్రైవేటు స్కూలులో ఐదో తరగతి చదువుతున్నారు. బుధవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చి భోజనం చేసిన తరువాత తిరిగి సైకిల్‌లో స్కూలుకు బయలు దేరారు. మార్గమధ్యంలోని టైటాన్ బిల్డింగ్ వద్దకు రాగానే వేలాడుతున్న కేబుల్ తంజూరు రెహ్మాన్‌కు తగలడంతో ఒక్కసారిగా ఇద్దరూ విద్యుత్‌షాక్‌కు గురై కింద పడిపోయారు. గుర్తించిన స్థానికులు వారిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో తంజూరు రెహ్మాన్ మృతి చెందగా మరో విద్యార్థి షేక్ అదనన్ తీవ్రంగా గాయపడ్డాడు. టూటౌన్ సీఐ నాగార్జున, ఎస్ఐ హుసేన్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేబుల్‌ను రోడ్డులో నుంచి తొలగించారు. చికిత్స పొందుతున్న బాలుడిని పరామర్శించారు. పిల్లల బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ ప్రమాదానికి కారణం విద్యుత్ శాఖ నిర్లక్ష్యమే అని బాధితులు ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరున్న రెండు ఎర్త్‌వైర్‌లు తెగి కేబుల్‌కు తాకుతున్నాయని తెలిపారు. ఈ కేబుల్ విద్యార్థులకు తాకగానే షాక్ గురయ్యారని ఇది పూర్తిగా విద్యుత్ శాఖ నిర్లక్ష్యమే అని బాధితులు పేర్కొన్నారు. ఏది ఏమైనా క్షణకాలం వ్యవధిలో ఓ విద్యార్థి నిండు జీవితం బలి కాగా మరో విద్యార్థి వికలాంగుడిగా మారిపోవడం అందరినీ కలచివేసింది.



మృతి చెందిన తంజూరు రెహ్మాన్



చికిత్స పొందుతున్న షేక్ అదనన్ ఆలీ



నీటి కోసం స్విచ్ వేస్తుండగా..

జమ్మలమడుగు, ఆగస్టు 21: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని రామిరెడ్డిపల్లెలో బుధవారం బొందల పద్మజ (23) అనే వివాహిత విద్యుత్తు షాక్ తగిలి మృతిచెందారు. పోలీసుల వివరాల మేరకు.. బొందల పద్మజ బుధవారం ఉదయాన్నే నీళ్ల మోటారు స్విచ్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఘటనా స్థలంలో కుప్పకూలిపోయారు. స్థానికులు వెంటనే జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలిది ఆళ్లగడ్డ మండలం కొండంపల్లె గ్రామం. మూడు సంవత్సరాల క్రితం రామిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన శ్రీనాథ్‌తో వివాహం జరిగింది. ఈమె భర్త కూల్‌డ్రింక్ షాపు వ్యాపారం చేసి జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



నవాబుపేటలో..

మైలవరం, ఆగస్టు 21: పంచాయతీ కుళాయికి పైప్ తగిలించి ఇంటిలోకి నీటి కోసం మోటారు వేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై రొడ్డా సంజన్న (68) మృతి చెందాడు. తలమంచిపట్నం ఎస్ఐ లక్ష్మీనారాయణ వివరాల మేరకు.. మైలవరం మండల పరిధిలోని నవాబుపేట గ్రామానికి చెందిన రొడ్డా సంజన్న తమ ఇంటికి కొంచెం దూరంలో ఉన్న పంచాయతీ కుళాయికి పైప్ తగిలించి రెండు వైర్లు మోటారు వద్ద పెట్టే క్రమంలో చేతికి విద్యుత్ షాక్ కొట్టడంలో స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను జమ్మలమడుగు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే సంజన్న మృతిచెందాడని తెలిపారు. ఈ మేరకు సంజన్న భార్య సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సంజన్నకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

పవన్ పంచ్‌లపై.. ఆశల మోసులు

- రైల్వేకోడూరులో వెక్కిరిస్తున్న దీర్ఘకాలిక సమస్యలు
- పరిష్కరిస్తారని.. ప్రజల ఎదురు చూపులు
- ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో...

రైల్వేకోడూరు, ఆగస్టు 21: అందరూ ఊహించిన విధంగానే రాష్ట్రంలో రాక్షస పాలన పోయి కూటమి ప్రభుత్వం వచ్చింది. రైల్వేకోడూరు అసెంబ్లీ స్థానంలో 2004 నుంచి టీడీపీ ఓటమి పాలవుతోంది. 2024లో జరిగిన ఎన్నికల్లో రైల్వేకోడూరు టిక్కెట్టును జనసేన పార్టీ కి కేటాయించడం.. విజయం సాధించడం జరిగింది. ఈ నేపథ్యంలో రైల్వేకోడూరు నియోజకవర్గంపై పై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్



నిధులు లేక నిలిచిపోయిన గాలేరు-నగరి కాల్వ పనులు



అటవీ అనుమతులు లేక ఆగిపోయిన కోడూరు-వెంకటగిరి రోడ్డు

ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఇదిలా ఉండగా... గత ఎన్నికల ప్రచారంలో అప్పా జ్యూస్ పరిశ్రమ తిరిగి ప్రారంభిస్తామని, పెండింగ్‌లో ఉన్న రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డు, పెనగలూరులో సోమశిల బ్యాక్ వాటర్ లిఫ్ట్ ఇరిగేషన్, గాలేరు-నగిరి కాలువ, రైతులకు శీతలగిడ్డంగులు, మామిడి, బొప్పాయి, అరటికి గిట్టుబాటు ధరలు, ఎర్రచందనం చెట్ల పరిరక్షణ తదితర హామీలు ఇచ్చారు. కాగా, పవన్‌కళ్యాణ్ త్వరలో రైల్వేకోడూరు నియోజకవర్గంలో పర్యటన ఉండటంతో నియోజకవర్గ ప్రజలు గంపెడాశ పెట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే....

రైల్వేకోడూరు ఎస్సీ నియోజకవర్గం అయినప్పటికీ జిల్లాలో రాజకీయంగా ప్రధాన భూమిక సంతరించుకుంది. నియోజకవర్గంలో ఎక్కువగా ఉద్యాన పంటలు మామిడి, అరటి, బొప్పాయి పంటలను రైతులు పండించి ఇతర దేశాలు, రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ప్రధానంగా రైతులకు పంటలను నిల్వ చేసేందుకు వీలుగా శీతలగిడ్డంగులు లేవు. దీంతో కోసిన పంటను వెంటనే ఎగుమతి చేయాల్సిన పరిస్థితి. మార్కెట్‌లో ఏ ధర ఉంటే ఆధరలకు రైతులు అమ్ముకోవాల్సి ఉంటుంది. ఇక రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డు పనులు సుమారు 30 ఏళ్లగా పెండింగ్‌లో ఉన్నాయి. ఇటు రైల్వేకోడూరు అటు వెంకటగిరి వరకు ఇరువైపులా రోడ్డును పూర్తి చేశారు. అటవీ అనుమతి లేక రోడ్డు పూర్తి కాలేదు. అలాగే అనంతరాజుపేట వద్ద అప్పా జ్యూస్ పరిశ్రమ సుమారు 30 ఏళ్ల క్రిందట మూత పడింది. రెండుసార్లు ప్రైవేటు వ్యక్తులు లీజుకు తీసుకుని కొంత కాలం నడిపి చేతులెత్తేశారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి అప్పాజ్యూస్ పరిశ్రమను ప్రారంభిస్తామని చెబుతున్నారే తప్ప పట్టించుకునే నాథుడు లేడు. ఈ పరిశ్రమను తెరిపిస్తే వందల మందికి ఉపాధి కలుగుతుంది. ప్రతి ఏటా కురుస్తున్న వర్షాలకు రైల్వేకోడూరు పట్టణంలోని నరసరాంపేట, ధర్మాపురం నదీపరివాహక ప్రాంతాలలో నివాసాలు ఉంటున్న ప్రజల ఇళ్లు వదర తాకిడికి కొట్టుకుపోతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో రూ.18 కోట్లతో రక్షణ గోడ నిర్మాణానికి భూమి పూజలు చేసినా.. కార్యరూపం దాల్చలేదు. అలాగే సుమారు రూ. 12 కోట్లతో సాగుతున్న రెడ్డివారిపల్లె రైల్వే అండర్ బ్రిడ్జి నత్తనడకన సాగుతోంది. గత కొన్నేళ్లుగా గాలేరు-నగిరి కాలువ పనులు నిలిచిపో యాయి. నిధులు లేక కాలువను పూర్తి చేయలేదు. కాలువ పూర్తి అయి ఉంటే రైల్వేకోడూరు నియోజకవర్గం శస్యశ్యామలం అయి ఉండేది.

రైల్వేకోడూరు నియోజకవర్గంలో అటవీ ప్రాంతం ఎక్కువ విస్తీర్ణంలో ఉంది. దీంతో ఎర్రస్మగ్లర్లు స్మగ్లింగ్‌ను కుటీర పరిశ్రమగా చేసుకున్నారు. చాలా మందిపై పీడీ యాక్టులు పెట్టినా ఫలితం లేదు. కొందరు అధికారులు, రాజకీయ నేతల అండతో స్మగ్లర్లు రెచ్చిపోతున్నారు. ఇప్పటికే అటవీ సంపదను దోచుకుని లూటీ చేశారు. కోట్లాది రూపాయల విలువ చేసే ఎర్రచందనాన్ని దోచుకుని స్మగ్లర్లు సొమ్ము



మంగంపేట ముగ్గురాయి గనులు



మూతపడిన అప్పా జ్యూస్ పరిశ్రమ

చేసుకున్నారు. ఎర్రచందనం సంపద పై ప్రత్యేక చట్టాలు తీసుకుని వస్తే తప్ప మరో దారి లేదు.

మంగంపేట బెరైటీస్ గనుల్లో కోట్లాది రూపాయల మేరకు వైసీపీ ప్రభుత్వంలో అక్రమాలు జరిగాయి. ఉద్యోగాల నియామకాలు, ఆస్పత్రి, స్కూలులో భోజనాలు, క్యాంటిన్ లో దోపిడీలు, అక్రమంగా తరలిన ముగ్గురాయి తదితర వాటిపై విచారణ వేగవంతం చేయాలని కార్మిక వర్గాలు డిమాండు చేస్తున్నాయి. ఇదే కాకుండా మంగంపేటలో గత మూడు నెలలుగా ముగ్గురాయి రవాణా ఆగిపోయింది. వెంటనే రవాణా సాగించాలని పలువురు కోరుతున్నారు. దీర్ఘకాలికంగా పరిష్కారం కాని సమస్యలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పరిష్కరించి.. నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని ప్రజలు నమ్మకం పెట్టుకున్నారు.

యూనివర్శిటీ అధ్యాపకులకు ఎంటీఎస్ అమలు చేయాలి



ఎమ్మెల్యే మాధవికి వినతిపత్రం అందిస్తున్న వైవీయూ అకడమిక్ కన్సల్టెంట్ బృందం

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 21: వైవీయూ అకడమిక్ అధ్యాపకులకు ఎంటీఎస్ అమలు చేయాలని అకడమిక్ కన్సల్టెంట్ బృందం కోరింది. బుధవారం కడప నగరం ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డిని కలిసి వినతులు సమర్పించిన వారు మాట్లాడుతూ టెట్, నెట్, పీహెచ్‌డీ అర్హత కలిగి అతి తక్కువ వేతనాలతో విద్యాలయాల్లో పనిచేస్తున్న తమకు ఎంటీఎస్ అమలు చేసేలా చూడాలని కోరారు. 2019లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు విశ్వవిద్యాలయాల్లో పనిచేసే అకడమిక్ కన్సల్టెంట్లకు ఎంటీఎస్ అమలు చేసేందుకు సీటీఎస్ వెంక టరమణ పేరుతో కమిటీ నియమించి.. అమలు దశలో ఎన్నికలు రావడంతో అర్ధాంత రంగా ఆ ప్రక్రియ ఆగిందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. తరువాత వచ్చిన ప్రభుత్వం 110 జీఓ ఇచ్చిందని, అయితే అది విశ్వవిద్యాలయాల్లో పూర్తి అమలు చేయలేదని తెలిపారు. జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఒప్పంద అధ్యాపకులకు రూ.62వేలు జీతం ఇస్తున్నారని, యూనివర్శిటీల్లో పనిచేసే తమకు రూ.35వేలు ఇస్తున్నారన్నారు. తమకు కూడా రూ.57వేల నుంచి 80 వేల వరకు సర్వీసును బట్టి వేతనం ఇవ్వాలని కోరారు. ఎంటీఎస్ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళతామని.. అసెంబ్లీలో ప్రస్తావిస్తామని హామీ ఇచ్చారు. అకడమిక్ కన్సల్టెంటు ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి మఠం దేవదాయశాఖ స్వాధీనం



మఠాన్ని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 21: స్థానిక ఆర్టీపీపీ రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి మఠంను బుధవారం దేవదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సుంకు వెంకటసుబ్బయ్య సత్రానికి చెందిన సర్వే నంబరు 57/3లోని 1.75 ఎకరాల స్థలంలో మఠాన్ని నిర్మించారు. మఠం స్థాపకులకు సుంకు వెంకటసుబ్బయ్య సత్రం ఈవో నోటీసులు ఇచ్చినా వారు స్పందించలేదు. దీంతో దేవాదాయ శాఖ చట్టం మేరకు పంచనామా నిర్వహించి ఒక ఇల్లు, మండపం, ఖాళీ స్థలం, ఇతర ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. ఇక మీదట మఠాన్ని దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ నరసింహసింగ్, సుంకుసత్రం ఈవో రామచంద్రాచార్యులు, వీఆర్వో రవి, సర్వేయర్ సురేంద్ర, రాజేష్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 6 నుంచి కోదండరామ స్వామి ఆలయంలో బాలాలయం

ఒంటిమిట్ట, ఆగస్టు 21: ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో సెప్టెంబరు 6 నుంచి 8వ తేదీ వరకు బలాలయం నిర్వహించనున్నారు. సెప్టెంబరు 6న సాయంత్రం 5.30 గంటలకు అంకురార్పణతో టీటీడీ అర్చకులు ప్రారంభించనున్నారు. సాధారణంగా గర్భాలయంలో జీర్ణోద్ధరణ కోసం బలాలయం చేపడతారు. ఇందుకోసం ఆలయంలోని మండపంలో నమూన ఆలయం ఏర్పాటు చేసి.. గర్భాలయంలోని మూలవర్ల చిత్రపటాలను ఏర్పాటు చేస్తారు. తదుపరి మహాసంప్రోక్షణ చేసి.. స్వామి అమ్మవార్లకు నిత్యకైంకర్యాలను స్వామివారి చిత్రపటాలకు నిర్వహించనున్నారు. ఆలయంలోని యాగశాలలో సెప్టెంబరు 7, 8 తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపడతారు. 8వ తేదీ ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల మధ్య తులాలగ్నంలో బలాలయ సంప్రోక్షణ నిర్వహించడం జరుగుతుందని టీటీడీ అధికారులు తెలిపారు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా చేయడమే లక్ష్యం



మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల అధికారి

రాయచోటిటౌన్, ఆగస్టు 21: నిరుద్యోగులను ఔత్సాహిక వ్యాపారవేత్తలుగా తయారు చేయడమే లక్ష్యమని జిల్లా పరిశ్రమలశాఖ అధికారి సూరి బాబు పేర్కొన్నారు. రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, ఐఎల్‌వో సంయుక్త ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పరిశ్రమలశాఖ అధికారి సూరిబాబు మాట్లాడుతూ ఈ శిక్షణలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తయారవడానికి కావాల్సిన మెలుకువలు, వ్యాపార నిర్వహణ శక్తి, సామర్థ్యాలు గురించి మహిళలు, వ్యాపారంలో రాణించటానికి కావాల్సిన వివిధ రకాల అనుమతులు గురించి తెలియజేశారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శివశంకర్ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వ్యాపార అవకాశాల గురిం చి తెలియజేశారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ జిల్లా లో చదువుకొని ఖాళీగా ఉన్న నిరుద్యోగులకు ఔత్సాహిక వ్యాపారవేత్తలుగా ఎదగ డానికి కావాల్సిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే శిక్షణ పూర్తయిన వారికి సర్టిఫికెట్‌తో పాటు బ్యాంకు రుణ సౌకర్యం కూడా కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఐఎల్‌వో మాస్టర్ ట్రైనర్ సునేష, ఏపీఎస్ఎస్‌డీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కారు - మోటరు బైకు ఢీ.. ఇద్దరు మృతి



మృతి చెందిన సాయికుమార్‌రెడ్డి, తరుణ్

పోరుమామిళ్ల, ఆగస్టు 21: స్థానిక మల్లకతవ వద్ద బుధవారం సాయంత్రం కారు-మోటరు బైకులు ఢీ కొన్న సంఘటనలో సాయి కుమార్‌రెడ్డి (19), తరుణ్ (17) అనే యువకులు మృతి చెందారు. కలసపాడు మండలం ఎగువరామాపురం గ్రామానికి చెందిన సాయికుమార్‌రెడ్డి, తరుణ్‌లు బుధవారం సాయంత్రం పోరుమామిళ్ల నుంచి స్వగ్రామానికి వెళుతుండగా.. రామేశ్వరం నుంచి పోరుమామిళ్లకు ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ తరుణ్‌కు, సాయికుమార్ రెడ్డిలను పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి డాక్టర్ల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు. వీరి మృతితో ఎగువ రామాపురంలో విషాధచాయలు అలుముకున్నాయి.

వ్యక్తి అనుమానాస్పద మృతి



చిన్నరెడ్డెయ్య (ఫైల్‌ఫొటో)

రాయచోటిటౌన్, ఆగస్టు 21: రాయచోటి మండల పరిధిలోని యండపల్లె గ్రామం ముసల్‌రెడ్డిగారిపల్లెకు సమీపంలో మంగళవారం చిన్నరెడ్డెయ్య (49) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... ముసల్‌రెడ్డిగారిపల్లెకు చెందిన చిన్నరెడ్డెయ్యకు ఇరువురు భార్యలు. మొదటి భార్య విడాకులు తీసుకుని విడిపోయిన అనంతరం వెంకటలక్ష్మమ్మ అనే మహిళను వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమార్తె కలదు. భార్య వెంకటలక్ష్మి కువైత్‌కి వెళ్లి తిరిగి వస్తూ ఉండేది. చిన్నరెడ్డెయ్య మద్యానికి అలవాటు పడి ప్రతిరోజు మద్యం సేవించడంతో పాటు జూదం తదితర వాటికి బానిస అయ్యాడు. దీంతో ఆరు నెలల క్రితం కువైత్ నుంచి వచ్చిన భార్య వెంకటలక్ష్మి అతని ప్రవర్తన సరిగా లేకపోవడంతో నెల రోజులుగా అమ్మగారి ఇంటి వద్ద ఉంటోంది. కాగా, కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న చిన్నరెడ్డెయ్య మద్యం సేవించి గతంలో ఒకసారి కుమార్తెకు ఫోన్ చేసి మీ నాయిక ఇక లేడని చెప్పాడు. ఈ క్రమంలో మంగళవారం ఒంటిమామిడి చెట్టు వద్ద పడిపోయి ఉండ టంతో.. మద్యం సేవించి ఊపిరి ఆడక మృతి చెందాడా.. లేక విషం తీసుకొని చనిపోయాడా అనే అనేది విచారణలో తేలాల్సి ఉంది. భార్య ఫిర్యా దు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించి.. కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ నరసింహులు తెలియజేశారు.

బ్రహ్మంగారి మఠంలో...



సుధాకర్‌రెడ్డి మృతదేహం

బ్రహ్మంగామఠం, ఆగస్టు 21: బ్రహ్మంగారి మఠంలోని విరాట్‌లాడ్జిలో బుధవారం రాత్రి ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ చంద్రశేఖర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు మైదుకూరు మండలం భూమాయపల్లెకు సమీపంలోని కొత్తపల్లికి చెందిన సుధాకార్‌రెడ్డిగా గుర్తించి.. వారి కుటుంబ సభ్యులకు విషయం తెలియజేశారు. మృతుని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేస్తే.. కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో దర్యాప్తు నిర్వహిస్తామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



సుండుపల్లె, ఆగస్టు 21: మండలంలోని మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ వంక బిడికి చెందిన మూడే యశ్వంత్ నాయక్ (24) మృతి చెందాడు. బంధువుల వివరాల మేరకు... బెంగుళూరులో యశ్వంత్ నాయక్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా జాబ్ చేస్తూ ఉండేవాడు. బైక్‌లో పాండిచ్చేరి వెళ్లి వస్తుండగా కారు ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడని తెలిపారు వీరి తండ్రి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. కాగా మృతుడు మూడు నెలల క్రితమే సాఫ్ట్‌వేర్ ఉద్యో గంలో జాయిన్ కాయినట్లు తెలిపారు. యశ్వంత్ నాయక్ మృతితో మాచిరెడ్డిగారిల్లెలో విషాదచాయలు అలుముకున్నాయి.

గ్రామ సభలను విజయవంతం చేయాలి : కలెక్టర్



వీసీ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ లోతేటిశివశంకర్

కడప(కలెక్టరేట్), ఆగస్టు 21: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 23న ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న గ్రామ సభలను జిల్లాలోని అన్ని పంచాయితీల్లో విజయవంతం చేయాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో గ్రామ సభల సంసిద్ధతపై అన్ని మండలాల క్షేత్ర స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 23న గ్రామ సభలను ఆయా మండల ప్రత్యేక అధికా రులు ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించి... గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తారన్నారు. గ్రామ సభలకు స్థానిక ప్రజా ప్రతినిధులను, సామాజిక బాధ్యత వహించే ప్రతి ఒక్కరినీ భాగస్వాములు చేయాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే అభివృద్ధి పనుల గుర్తింపు ప్రణాళికా ప్రక్రియను రూపొందించుకునేందుకు సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. అందుకు ఆయా మండలాల ఈఓపీఆర్డీలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు, పంచాయతీ సెక్రటరీలు సంబంధిత పనులపై సమీక్షించుకుని.. వాటిపై చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ సభలు పూర్తయిన వెంటనే ప్రభుత్వం రూపొందించిన ఈఎంఎంఎస్ యాప్ ద్వారా ఫొటోలు, వీడియోలు, సంబధిత మినిట్స్ నోట్ డాక్యుమెంట్లను అప్‌లోడు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ తాగునీటి సరఫరాలో ఎక్కడా అంతరాయం లేకుండా పనులు చేపట్టాలన్నారు. అక్టోబరు 2 నుంచి ప్రారంభం కానున్న నూతన గృహ నిర్మాణాల్లో ప్రతి ఇంటికీ కచ్చితంగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. డ్వామా పీడీ జోయల్ విజయకుమార్, డీపీఓ ప్రభాకర్ రెడ్డి, జడ్పీ సీఈఓ సధాకర్‌రెడ్డి, పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ శారదమ్మ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారి పనులను పరిశీలించిన జేసీ



అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆదిత్‌సింగ్

చాపాడు, ఆగస్టు 21: మండలంలో నిర్మిస్తున్న బెంగుళూరు-అమరావతి జాతీయ రహదారిని జాయింట్ కలెక్టర్ ఆదిత్‌సింగ్ బుధవారం పరిశీలించారు. కేతవరం గ్రామం గ్రామం వద్ద వేస్తున్న రోడ్డు నిర్మాణం పనులను, విశ్వనాథపురం గ్రామం వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జిని ఆమె పరిశీలించారు. నేషనల్ హైవే అథార్టి అధికారులతో, తహసీల్దారు రవీంద్రారెడ్డి, డిప్యూటీ తహసీల్దారు యామినితోనూ జేసీ మాట్లాడారు. రోడ్డు నిర్మాణానికి సేకరించిన భూములకు సంబంధించి రైతులకు నష్టపరిహారం ఇంకా ఎంతమందికి ఇవ్వాల్సి ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నష్టపరిహారం మంజూరుకాని రైతుల వివరాలను తమకు పంపాలన్నారు. కార్యాలయంలో భద్రపరిచిన రెవెన్యూ రికార్డులను ఆమె పరిశీలించారు. అలాగే ఎస్.మైదుకూరులో నిర్మిస్తున్న బెంగుళూరు-అమరాతి హైవే రోడ్డు, బ్రిడ్జి కూడా ఆమె పరిశీలించారు.

గంజాయి విక్రయదారుల అరెస్టు



ప్రొద్దుటూరు, ఆగస్టు 21: ప్రొద్దుటూరులో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న గంజాయివిక్రయాలపై పోలీసులు దాడులు చేశారు. బుధవారం డీఎస్పీ భక్తవత్సలం పర్యవేక్షణలో రాబడిన సమాచారం మేరకు స్థానిక కొవ్వూరు గ్యారేజీ వద్ద గల ఖాళీ స్థలంలో గంజాయి విక్రయాలు జరుపుతున్న నలుగురు వ్యక్తులను టూటౌన్ సీఐ యుగంధర్, ఎస్ఐ ధనుంజయుడులు అదుపులోకి తీసుకు న్నారు. వీరి వద్ద నుంచి 4 కేజీల గంజాయి, రెండు మోటార్ బైకులు, నాలుగు సెల్ ఫోన్‌లు, రూ.33 వేల నగదును సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. వీరు వైజాగ్ నుంచి కిరణ్ అనే వ్యక్తి ద్వారా ప్రొద్దు టూరుకు ప్రైవేటు ట్రావెల్స్‌లో పూతరేకులు వ్యాపారం ముసుగులో గంజాయిని అట్టపెట్టెలలో తీసుకొస్తున్నట్లు విచారణలో వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టు అయిన వారిలో షేక్ అహ్మద్ , మంజుల వేణు, షేక్ అజ్మతుల్లా, నాదీండ్ల సలీమ్ ఉనానరు. వీరంతా ఎర్రగుంట్లకు చెందిన రాణివనం శాంతినగర్‌కు చెందిన వారుగా పోలీసులు తెలిపారు. వీరందరిని అరెస్టు చేసి.. వారిపై మాదకద్రవ్యాల అక్రమ రవాణ విక్రయాలు జరుపుతు న్నట్లు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పెట్టినట్లు డీఎస్పీ భక్తవత్సలం తెలిపారు

యువకుడి ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం, అగస్టు 21: స్థానిక కాల్వకట్టవీధిలో బుధవారం ఇంట్లో ఉరివేసుకుని లోకేష్‌కుమార్ (21) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పా డినట్లు త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి తెలిపారు. వివరాలిలా.. లోకేష్‌కుమార్ బేల్దారి పనులు చేసేవాడు. అతనికి అపుడపుడు మూర్చ వస్తుండేది. ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి మూర్చవచ్చి కొద్ది సేపటికి తగ్గిపోయింది. కాసేపు పండుకుంటానని ఇంట్లోకి వెళ్లిన లోకేష్ బయటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లిచూడగా.. అప్పటికే ఇంట్లో చీరతో ఉరి వేసుకుని అత్మహత్య చేసుకున్నాడు. మూర్చ వస్తుందనే బాధతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ గోవిందరెడ్డి తెలిపారు.

68 మద్యం బాటిళ్లు స్వాధీనం

సింహాద్రిపురం, ఆగస్టు 21: మండల పరిధిలోని తెలికి, బిదినంచెర్ల గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై బుధవారం దాడులు నిర్వహించి 68 అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని.. వరకుమార్, కార్తీక్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తులసినాగప్రసాద్ తెలిపారు. మండలంలో ఏ గ్రామంలోనైనా అక్రమ మద్యం అమ్మకాలు, జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

20 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



సిద్దవటం, ఆగస్టు 21: మండలంలోని ఫారెస్ట్ ఏరియా ఎర్రమనుశీల వద్ద మంగళవారం రాత్రి తొమ్మిది మంది తమిళ స్మగ్లర్లను అరెస్టు చేసి.. 20 ఎర్రచందనం దుంగలను, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు కడప ఫారెస్ట్ రేంజి అధికారి ప్రసాద్ తెలియజేశారు. వీటి విలువ 3 లక్షలు రూపాయలు ఉంటుందని తెలిపారు. నిందితులను తిరుపతి ఫారెస్ట్ కోర్టుకు హాజరు పరిచామని తెలిపారు. ఎక్కడైనా చందనం అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని.. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆయన తెలియజేశారు. అటవీశాఖ బీట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ వద్దు...రాజ్యాధికారం ముద్దు

జిల్లాలో భారత్‌బంద్ విజయవంతం ● ఆర్టీసీ బస్టాండు వద్ద మాల మహానాడు నిరసన

కడప (మారుతీనగర్) ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మాల మహానాడు రామాజీ, జాకట విజయ శేఖర్ వర్గాలు వేర్వేరుగా డిమాండ్ చేశారు. వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం తీర్పును నిరసిస్తూ బుధవారం చేపట్టిన భారత్ బంద్‌లో భాగంగా జిల్లాలో బంద్ విజయవంతమైంది. అన్ని మండలాల్లో మాల మహానాడు ఆధ్వర్యంలో వివిధ కూడళ్లలో నిరసనలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు మూయించారు. కడప ఆర్టీసీ బస్టాండు వద్ద 20 నిమిషాల పాటు బస్సులను కదలనివ్వలేదు. రాష్ట్ర అధ్యక్షుడు తాళ్ళపాక వినోద్‌కుమార్ మట్లాడుతూ కులాల వారీ మాల, మాదిగలను వేరుచేసి బ్రిటీష్‌కాలాన్ని తిరిగి తెరపైకి తెస్తూ విభజించు, పాలించే తీరును మానుకోవాలన్నారు. దళితులంతా ఐక్యతతో ముందుకు సాగి వర్గీకరణ కోసం కాకుండా రాజ్యాధికారం కోసం సంఘటితమై పోరు సాగిద్దామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. సాగర్, జిల్లా అధ్యక్షుడు కిరణ్, నేతలు ఎం. కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



కడప ఆర్టీసీ బస్టాండు వద్ద చేపడుతున్న నిరసన

వర్గీకరణకు వ్యతిరేకంగా బహుజన సంఘం ఐక్యవేదిక పిలుపు మేరకు భారత్ బంద్‌లో భాగంగా అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో జాకట విజయశేఖర్, రాష్ట్ర కార్యదర్శి ఇల్లూరి సురేష్ మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం కొందరు నేతలు మాల, మాదిగలను వేరుచేసేందుకు పూనుకోవడం మంచిదికాదన్నారు. 341 ఆర్టికల్ ప్రకారంగా ఎస్సీలను ఏబీసీడీలుగా విభజించడం విడ్డూరంగా వుంద న్నారు. వర్గీకరణ ముసుగులో క్రిమిలేయర్ అనే పద్ధతిని ఉపయోగించి మొత్తానికి రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు కేంద్రం కుట్రకు తెరతీసిందన్నారు.

కార్యక్రమంలో నేతలు జె. భాస్కర్, పి. సంజీవయ్య, డేవిడ్, సత్యారాజ్, దీపక్, పురుషోత్తం, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

జనసేన ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ● రిమ్స్‌లో కొనసాగుతున్న సమ్మె
కదం తొక్కిన ట్రిపుల్‌ఐటీ విద్యార్థినులు ● జన విజ్ఞాన వేదిక, సమత సభ్యుల మద్దతు

సికెదిన్నె, ఆగస్టు 21: మహిళలకు రక్షణ కల్పించాలని జనసేన డాక్టర్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వాకారెడ్డి ప్రసాద్ తెలిపారు. కలకత్తా నగరం ఆర్‌జీకర్ హాస్పిటల్‌లో వైద్యురాలిపై హత్యాచారం చేసిన మానవమృగాలను కఠినంగా శిక్షించాలని, ఘటనను నిరసిస్తూ జనసేన కమలాపురం ఇన్‌చార్జి ఇందిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో భారత్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు నిత్యం ఎక్కడో ఒక చోట అన్యాయానికి గురవుతున్నారని వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ప్రభుత్వాలు పోలీసు వ్యవస్థను సమర్థవంతంగా పనిచేసేలా మహిళలకు పూర్తి రక్షణ కల్పించాలన్నారు. మహిళల ద్వారానే సమాజంలో మార్పు తీసుకురాగలమని, అటువంటి మహిళలకు అన్నివిధాలా భద్రత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇటువంటి ఘటనలు మరెక్కడా పునరావృతం కాకుండా ప్రభుత్వాలు నేరస్థులకు కఠిన శిక్ష విధించాలన్నారు. కార్యక్రమంలో జనసేన నేతలు, కళాశాల చైర్మన్ ఫరూక్ అహ్మద్, ప్రిన్సిపాల్ మహబూబ్ రసూల్, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో కొనసాగుతున్న సమ్మె

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 21: కోల్‌కత్తా ఘటనకు నిరసనగా బాధితురాలికి న్యాయం జరగాలని కోరుతూ రిమ్స్‌లో డాక్టర్లు చేపట్టిన సమ్మె రిలేదీక్ష కొనసాగుతోంది. స్థానిక వైద్యసంస్థల్లో భద్రతా వ్యవస్థలను పటిష్టం చేయాలని దేశవ్యాప్తంగా వైద్యులు నిరసన చేస్తున్నారు. డాక్టర్ల నిరసనకు ప్రజల నుంచి అపార మద్దతు లభిస్తోంది.





భారత్ కాలేజీలో జనసేన ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన - రిమ్స్‌లో రిలే దీక్షలో డాక్టర్లు



సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్నా

నిందితులను కఠినంగా శిక్షించాలి

కలకత్తా ఘటనలో మానవమృగాలను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ నగర కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ వైద్యురాలి ఘటనను తీవ్రంగా ఖండించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్ష కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, సీఐటీయూ జిల్లా నేతలు, ఐద్వా, మున్సిపల్ నాయకులు పాల్గొన్నారు.

వైద్యవిద్యార్థుల నిరసకు జేవీవీ మద్దతు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 21: కలకత్తా ఘటనకు నిరసనగా రిమ్స్‌లో విద్యార్థుల నిరాహారదీక్షకు జనవిజ్ఞానవేదిక, సమత సభ్యులు కామేశ్వరమ్మ, అరుణ, సునీత, రాష్ట్ర కమిటీ సభ్యులు సరస్వతి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. దోషులకు కఠిన శిక్ష పడాలని బాధ్యులైన ప్రతి ఒక్కరినీ శిక్షించి మహిళలకు అండగా నిలవాలని కోరారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కలకత్తా ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని ఖురేషీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కడప మాజీ డిప్యూటీ మేయరు ఆరిఫుల్లా డిమాండ్ చేశారు. బుధవారం గుంటూరు జిల్లా మంగళగిరిలో రాష్ట్ర ఖురేషి సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. షౌకత్, ఖాదర్, సుహైల్, భాస్కర్, సుభాని,షాదక్ పాల్గొన్నారు.

కదం తొక్కిన ట్రిపుల్‌ఐటీ విద్యార్థినులు

వేంపల్లె, ఆగస్టు 21: కలకత్తా ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని ట్రిపుల్‌ఐటీ విద్యార్థినులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఆర్కేవ్యాలీ క్యాంపస్‌లో డైరెక్టర్ కుమారస్వామి గుప్త ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్ల కార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా బాధ్యులను కఠినంగా శిక్షించి ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడే వారికి తగిన బుద్ధి చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి, ఏఓ రవికుమార్, డీన్ రత్నకుమారి, ప్రొఫెసర్ అమరేంద్రకుమార్, అధ్యాపకులు తదితరులుపాల్గొన్నారు.



రోడ్డెక్కిన ట్రిపుల్‌ఐటీ విద్యార్థినులు

వైవీయూ ఇన్‌చార్జ్ వీసీని తొలగించాలి



నిరసన తెలుపుతున్న ఏఐవైఎఫ్ నేతలు

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 21: అవినీతి అక్రమాలకు అనైతిక అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన ఇన్‌చార్జ్ వీసీ కె.క్రిష్టారెడ్డిని తొలగించే వరకు పోరాటం ఆగదని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి గంగాసురేశ్, విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) జిల్లా కార్యదర్శి వలరాజు డిమాండ్ చేశారు. ఆర్‌టీఐ ద్వారా తీసుకున్న సమాచారాన్ని బుధవారం వైవీయూలోని వేమన విగ్రహం ఎదుట విడుదల చేసిన వారు మాట్లాడుతూ క్రిష్టారెడ్డి అవినీతి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. అనైతిక కార్యకలాపాలకు పాల్పడిన వారిని సమర్థించిన వారు విద్యార్థులకు నైతిక విలువలు బోధించగలరా అని ప్రశ్నించారు. వెంటనే ఆయనను విధుల నుంచి తొలగించాలని, లేని పక్షంలో 23న వైవీయూను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు శివశంకర్, రాజేశ్ పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీకి అంబులెన్స్



ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్‌కు అంబులెన్స్‌ను అప్పగిస్తున్న దృశ్యం

వేంపల్లె, ఆగస్టు 21: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగుల కోసం అంబులెన్స్‌ను జిల్లా వైద్య విధానపరిషత్ ఇచ్చింది. ప్రస్తుతం ఒక అంబులెన్స్ ఉండగా అదనంగా బుధవారం రెండో అంబులెన్స్‌ను ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తకు అప్పగించారు. ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఇటీవల ట్రిపుల్‌ఐటీని సందర్శించి అధికారులు, విద్యార్థులతో మాట్లాడారు. 8వేలపైచిలుకు విద్యార్థులున్నారని, మరో అంబులెన్స్ అవసరమని అధికారులు ఎమ్మెల్సీకి తీసుకెళ్లగా ఆయన చొరవ తీసుకుని కలెక్టర్‌ను కలిసి ట్రిపుల్‌ఐటీకి అంబులెన్స్ ఇవ్వాలని కోరారు. కలెక్టర్ ఆదేశాలతో జిల్లా వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో అంబులెన్స్‌ను ట్రిపుల్‌ఐటీలో డైరెక్టర్‌కు అప్పగించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు జివిరమణ, టీడీపీ నేతలు దేశం వెంకటసుబ్బారెడ్డి, ఏమిరెడ్డి కృష్ణారెడ్డి, పోతిరెడ్డి శివ, భానుకిరణ్ అంబులెన్స్‌ను ట్రిపుల్‌ఐటీ అధికారులకు స్వాధీన పరిచారు. ఏఓ రవికుమార్, ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ చదువుకోవాలి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 21: విద్యాహక్కు చట్టం ప్రకారం ఆరేళ్లు దాటిన ప్రతి ఒక్కరూ చదువుకోవాలని చెమ్ముమియ్యాపేట జడ్పీ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మేరీ తెలిపారు. కడప నగరం భగత్‌సింగ్ నగర్‌లో అర్పిత మూడేళ్ల కిందట అనారోగ్యం కారణంగా పాఠశాల మానేసిన విద్యార్థిని తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మేరీ ఉపాధ్యాయులు సీఆర్‌ఎంపీ నాగమణి కుమారి 7వ తరగతిలో చేర్పించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ బాలికలకు తప్పనిసరిగా కనీస విద్యార్హత పొందాలన్నారు. మారుతున్న కాలానుగుణంగా మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థి కిట్ అందించారు.


తమలపాకులో ఎండు తెగుళ్లను నివారించాలి



తమలపాకు తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, రైతు

సికెదిన్నె, ఆగస్టు 21: తమలపాకులో ఎండుతెగులు నివారణ చేపట్టాలని భారతీయ ఉద్యాన పరిశోధన సంస్థ బెంగుళూరు శాస్త్రవేత్త డాక్టర్ హిమబిందు తెలిపారు. కొలుములపల్లెలో తమలపాకులో ఎండు తెగులు నివారణ, సమగ్ర యాజమాన్య అంశంపై కృషి విజ్ఞాన కేంద్రం రైతులకు ఏర్పాటు చేసిన శిక్షణలో ఆమె మాట్లాడుతూ తమలపాకులో ప్రధాన సమస్య ఎండు తెగులు అని, దీని నివారణకు 90 కిలోల పశువుల ఎరువు, పది కిలోల వేపపిండి, రెండు కిలోల ట్రైకో డెర్మావిరిడి కలిపి వేయాలన్నారు. గాలిలో తేమ ఎక్కువగా ఉండి, పగటి ఉష్ణోగ్రతలు తక్కువగా ఉన్నప్పుడు ఈ తెగుళ్ల ఆశిస్తాయన్నారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి జొన్న లేదా మొక్కజొన్నతో పంట మార్పిడి చేయడం, వేసవిలో దుక్కి దున్నాలన్నారు. యాజమాన్య పద్ధతుల ద్వారా రైతులు దిగుబడులు పెంచుకునే అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కేవీకే ఉద్యానశాస్త్రవేత్త మానస, గ్రామ ఉద్యాన అసిస్టెంట్ పావని, రైతులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా బీరం సుబ్బారెడ్డి



పురందేశ్వరి నుంచి నియామకపు పత్రాన్ని అందుకుంటున్న బీరం సుబ్బారెడ్డి

కడప (మారుతీనగర్) ఆగస్టు 21: బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా బీరం శ్రీధర్ రెడ్డి విద్యా సంస్థల చైర్మన్ బీరం సుబ్బారెడ్డి నియమితులయ్యారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి నుంచి ఉత్తర్వులను అందుకున్న ఆయన మాట్లాడుతూ జిల్లాలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయనున్నట్లు వెల్లడించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగళ శశిభూషణ్‌రెడ్డి, బీజేపీ స్టేట్ కల్చరల్ సెల్ సెక్రటరీ భానుప్రకాష్, నేతలు లక్ష్మీనారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కాండం తొలిచే పురుగులతో నష్టం

కమలాపురం రూరల్, ఆగస్టు 21: వరిపైరులో కాండం తొలిచే పురుగులు వస్తే పంటకు నష్టం వాటిల్లుతుందని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. అప్పాయపల్లెలో వరిని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ వరి పైరులో కాండం తొలుచు పురగు, ఆకుముడత పురుగులను గుర్తించామన్నారు. పిలకలు వేసే దశలో పురుగు ఆశించినప్పుడు కాండం కింది భాగాన్ని నమిలి తినడం వల్ల ఎండిపోతుందన్నారు. దీనిని డెడ్‌హార్ట్ అని అంటారు. కంకి దశలో ఆశించినప్పుడు తెల్లకంకులు ఏర్పడతాయని, దీని ద్వారా పంటకు ఎక్కువగా నష్టం జరుగుతుందన్నారు. ఆకుముడత పురుగు నివారణకు నాట్లు నాటిన 15రోజుల తరువాత 3జీ కార్బోఫ్యూరాన్ గుళికలు 10 కిలోలు లేదా 4జీ కార్టప్ హైడ్రోక్లోరైడ్ 6 నుంచి 8 కిలోలు ఎకరాకు వేసుకోవాలని తెలిపారు.

నామమాత్రంగా మండల సమావేశం

వేముల, ఆగస్టు 21: ప్రజల సమస్యలు, ఆకాంక్షలు నెరవేర్చాల్సిన సర్పంచులు, ఎంపీటీసీల సమావేశం కేవలం గంటలోపే ముగిసింది. బుధవారం ఎంపీడీఓ అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో కేవలం అధికారులు తమ అంశాలను మాత్రమే ప్రస్తావించగా సర్పంచులు, ఎంపీటీసీలు వారి గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాకపోవడం కొసమెరుపు. ప్రజాప్రతినిధులు అధికారులు చెప్పిన విషయాలను విన్నారే తప్ప మా గ్రామంలో ఫలానా సమస్య ఉందని సర్పంచుగాని, ఎంపీటీసీ గాని సభ దృష్టికి తీసుకురాలేదు.

పంట నమోదును బాధ్యతగా చేయండి



పంట నమోదు చేస్తున్న ఏఓ రమేష్

లింగాల, ఆగస్టు 21: అవకతవకలు లేకుండా అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి పంట నమోదును విజయవంతం చేయాలని మండల వ్యవసాయాధికారి రమేష్ సిబ్బందికి సూచించారు. బుధవారం రామనూతలపల్లెలో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన పంట సాగుచేస్తున్న ప్రతి రైతు రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి పంట నమోదు చేసుకోవాలని సూచించారు. పంట నమోదుతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది మౌనిక, రైతులు, పాల్గొన్నారు.

పంట నమోదును పరిశీలించిన ఏఓ

వేముల, ఆగస్టు 21: మీదిపెంట్ల రెవెన్యూ గ్రామంలో పంట నమోదును మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి పరిశీలించారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 4936 ఎకరాల్లో పంట నమోదు పూర్తైనట్లు తెలిపారు. ప్రభుత్వం సాంకేతికను వినియోగించి పక్కాగా అమలు చేస్తుందన్నారు. పంటనమోదు జాబితాలో తమపేరును పరిశీలించి ఇ-కేవైసీ వేయాలని తెలిపారు. రైతుసేవా కేంద్రాల్లో లభించే పొటాష్, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్ సంతోష్ నాయక్‌రైతులు పాల్గొన్నారు.

‘టీచర్‌ను సస్పెండ్ చేయాలి’

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 21: పాఠశాల విద్య పూర్వ ఆర్‌జేడీ రాఘవరెడ్డిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ సందర్భంగా చోటు చేసుకున్న సంఘటనలో ఓబులవారిపల్లె టీచర్ ఆదినారాయణరెడ్డిపై చర్యలు తీసుకోవాలని హ్యూమన్‌రైట్స్ స్టూడెంట్స్ సెల్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ డిమాండ్ చేశారు. కడప ఆర్‌జేడీ కార్యాలయంలో ఏడీ అరుణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించిన ఆయన మాట్లాడుతూ పూర్వ ఆర్‌జేడీ రాఘవరెడ్డిపై వెల్లువెత్తిన ఆరోపణలపై ఉపాధ్యాయ సంఘాలు, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి చేసిన ఫిర్యాదుపై విచాణ జరుగుతున్న సమయంలో టీచర్ రాఘవరెడ్డికి మద్దతుగా సాక్షిపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. ఈ విషయంలో ఉపాధ్యాయుడు ఆదినారాయణరెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

సర్వరాయసాగర్‌కు కృష్ణాజలాలు



సర్వరాయసాగర్‌కు వెళ్తున్న కృష్ణాజలాలు

వీరపునాయునిపల్లె, ఆగస్టు 21: సర్వరాయసాగర్ రిజర్వాయర్‌కు కృష్ణాజలాలు చేరుతున్నాయి. రెండురోజుల కిందట ముద్దనూరు మండలం శెట్టివారిపల్లె సమీపంలోని గండికోట రిజర్వాయర్ కాల్వ గేట్లను కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యకుమార్‌రెడ్డి ఓపెన్ చేశారు. వామికొండ సర్వరాయసాగర్ కింద పదివేల ఎకరాలకు, సర్వరాయసాగర్ రిజర్వాయర్ కింద 25వేల ఎకరాలకు నీరు అందేలా నీటిని విడుదల చేశారు. రెండు రోజుల నుంచి సర్వరాయసాగర్, వామికొండకు కృష్ణాజలాలు చేరుతున్నాయి.

ప్రవహిస్తున్న మొగమోరు వంక

వీరపునాయునిపల్లె, ఆగస్టు 21: ఎన్.పాలగిరి, గోనుమాకులపల్లె మార్గమధ్యలో ఉన్న మొగమోరు వంక ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతంలో గత రాత్రి కురిసిన వర్షంతో మెండుగా వంక పారుతోంది. వంక పారుతుండడంతో బోరుబావులకు భూగర్భజలాలు బాగా పెరుగుతాయని పలువురు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ నిర్మాణంపై విచారణ జరపాలి

వేంపల్లె, ఆగస్టు 21: వేంపల్లె రాజీవ్‌నగర్ కాలనీలో అక్రమ నిర్మాణం చేపట్టారని సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ హరినాథ్‌రెడ్డికి టీడీపీ మండల కన్వీనర్ మునిరెడ్డి, మైనార్టీ కన్వీనర్ వలి ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వేయర్ శివారెడ్డి, వీఆర్వో రవీంద్రనాథరెడ్డి రాజీవ్‌నగర్ కాలనీలోని నిర్మాణ స్థలానికి వెళ్లారు. ఎనిమిది సెంట్ల స్థలంలో అక్రమ నిర్మాణం చేపట్టారని సర్వే చేస్తే వెల్లడవుతుందని టీడీపీ నేతలు అధికారులకు వివరించారు. పూర్తి సర్వే చేసి అక్రమమని తేలితే చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

‘బుద్ధ టౌన్‌షిప్ డెవలపర్స్ దౌర్జన్యం దుర్మార్గం’

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 21: గౌతమబుద్ధ టౌన్‌షిప్ డెవలపర్స్ దౌర్జన్యం దుర్మార్గమని టౌన్‌షిప్ నివాసితుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు వి.శ్రీనివాసులరెడ్డి, బయపురెడ్డి తెలిపారు. బుధవారం ప్రకాశ్‌నగర్ గౌతమబుద్ధ టౌన్‌షిప్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ టౌన్‌షిప్‌లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చి వాటన్నింటినీ తుంగలో తొక్కారన్నారు. దీనిపై టౌన్‌షిప్ డెవలపర్స్‌ను పలుమార్లు అడిగినా ఎటువంటి చర్యలు తీసుకోకపోగా గత ప్రభుత్వంలో తమపై అక్రమ కేసులు పెట్టారన్నారు. ప్రస్తుతం టౌన్‌షిప్ అభివృద్ధి పనులు చేస్తున్నా డెవలపర్స్ అడ్డుకుంటున్నారన్నారు. కొంతకాలంగా బిల్డర్లు తమపై దౌర్జన్యం చేస్తూనే ఉన్నారని ఆరోపించారు. టౌన్‌షిప్‌లో జరిగే అభివృద్ధి పనులను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వారు అభివృద్ధి చేయకపోగా తాము అభివృద్ధి చేసుకుంటున్నా అడ్డంకిగా మారారని ఆరోపించారు. విద్యుత్ అధికారులు టౌన్‌షిప్‌కు రెండు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేస్తే వాటిని సైతం అడ్డుకునే పయత్నం చేశారన్నారు. మంగళవారం టౌన్‌షిప్‌లో దౌర్జన్యంగా నివాసితులపై దౌర్జన్యం చేసేందుకు వచ్చారని ఆరోపించారు. గౌతమబుద్ధ బిల్డర్స్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నివాసితుల సంఘం ప్రతినిధులు, నివాసితులు పాల్గొన్నారు.

‘ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి’

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 21: కడప నగరంలో అండర్‌గ్రౌండ్ వైరింగ్ చేయాలని ప్రమాదాలు జరగకుండా చూడాలని మాజీ డిప్యూటీ మేయరు ఆరిఫుల్లా తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నగరంలో విద్యుత్ ప్రమాదానికి ఒక చిన్నారి మృతి చెందడం మరోచిన్నారి చికిత్స పొందుతుండడం బాధాకరమన్నారు. ఇటువంటివి పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం బాలుడి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

‘మానవత’ సేవలు మరువలేనివి : సీఐ

చెన్నూరు, ఆగస్టు 21: సమాజ సేవలో ముందున్న మానవత సంస్థ సేవలు అభినందనీయమని ఇలాంటి సంస్థలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని సీఐ పురుషోత్తంరాజు పిలుపునిచ్చారు. మానవత సంస్థ వారోత్సవాల్లో భాగంగా సీతారాముల సంకీర్తన క్షేత్రం నుంచి పాతబస్టాండు వరకు సంస్థ సభ్యు లు, విద్యార్థులు కలిసి శాంతి ర్యాలీ, అనంతరం మానవహారం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ 2004లో పశ్చిమ గోదావరి జిల్లాలో ఆవిర్భవించిన ఈ సంస్థ నేడు రాష్ట్ర వ్యాప్తంగా 119 శాఖలుగా విస్తరించి సమాజసేవ చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. మండల శాఖ అధ్యక్షుడు ఆవుల బసిరెడ్డి, ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ, టీడీపీ, వైసీపీ కన్వీనర్లు విజయభాస్కర్, జీఎస్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేశ్ యాదవ్, ఆకుల ప్రసాద్‌బాబు, ఇందిరెడ్డి శివారెడ్డి, గుగ్గిళ్ల చాణక్య, శ్రీనివాసరాజు, ఆటోబాబు, కార్యదర్శి రామసుబ్బారెడ్డి, బీజేపీ నేతలు గాడి భాస్కర్, ప్రతాప్‌రెడ్డి, గోవిందు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

లాభాపేక్ష లేకుండా ఇసుక సరఫరా : కలెక్టర్

కడప(కలెక్టరేట్) ఆగస్టు21: లాభాపేక్ష లేకుండా వినియోగదారులకు డిపోల ద్వారా ఇసుకను సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలసి కలెక్టర్ మైన్స్, ఇరిగేషన్, రవాణా శాఖాధికారులతో జిల్లాలో ఇసుక సరఫరా విధానం అమలుపై సమీక్షించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉచిత నూతన ఇసుక పాలసీలో ఎలాంటి సమస్యలు లేకుండా పారదర్శకంగా పంపిణీ జరగాలన్నారు. ఇసుక విధానంలో ప్రభుత్వం కేవలం నిర్వహణ చార్జీలను మాత్రమే తీసుకుంటుందని, ప్రజలపై ఎలాంటి పన్ను భారం మోపడం లేదన్నారు. టన్ను ఇసుక ధరను ఒక్కోరీచ్ పరిధిలోని స్టాక్ పాయింట్‌కు ఒక్కోధరను నిర్ణయించామన్నారు. సచివాలయాలు, స్టాక్ పాయింట్ల వద్ద నిర్ణీత సమయంలో ఇసుక ట్రాన్సిస్ట్ ఫారంలో వివరాలు, ఆధార్ నమోదు చేయాలన్నారు. వర్షాకాలం పూర్తవగానే జిల్లాలో అన్ని స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు.

ప్రపంచశాంతి కోసం మానవత ర్యాలీ



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ఎర్రగుంట్ల, ఆగస్టు 21: ప్రపంచమానవాళి శాంతికోసం ఎర్రగుంట్లలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. మానవత ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న శాంతిర్యాలీ వారోత్సవాలు బుధవారం నిర్వహించారు. ముద్దనూరు రోడ్డులోని బాలుర ఉన్నత పాఠశాల వద్ద నగరపంచాయతీ చైర్మన్ మూలె హర్షవర్ధన్‌రెడ్డి, ఎంఈవో శివప్రసాద్ శాంతికపోతాలను ఎగురవేసి ర్యాలీని ప్రారంభించారు. పాఠశాల హెచ్ఎం, విద్యార్థులు, ఉపాధ్యాయులు, మానవత సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ శాంతి నినాదాలు చేశారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మానవత చైర్మన్ డి.రఘురామిరెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ రామాంజనేయరెడ్డి, హెచ్ఎం. రామాంజనేయరెడ్డి, మానవత యూనిట్ సభ్యులు ఎస్వీ రమణారెడ్డి, మేడా రమేష్‌బాబు, గంగాధర్‌రెడ్డి, జి.మల్లికార్జునరెడ్డి, రావర్ధన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, చెన్నక్రిష్ణారెడ్డి, సాంబశివారెడ్డి, సుబ్బరాయుడు, శ్రీరాములు, గోవిందరెడ్డి, జి.ప్రభాకర్‌రెడ్డి, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

ముద్దనూరు ఆగస్టు21: మండల పరిధి తిమ్మాపురం గ్రామంలో జాతీయ గాలికుంటు నివారణ కార్యక్రమంలో భాగంగా బుధవారం జమ్మలమడుగు పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో పశువులకు వ్యాధి నిరోధక టీకా వేశారు.ఈ సందర్భంగా ఆయన పాడి పశువులకు గాలికుంటు వ్యాధి టీకా తప్పని సరిగా వేయించాలని పాడి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ముద్దనూరు పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి సహాయసంచాలకులు వాసా శ్రీనివాస, శశిరేఖ, నాగుమయ్య, యాసీన్, లావణ్య , పాడి రైతులు పాల్గొన్నారు.

పశుగర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం ప్రారంభం



పశు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం ప్రారంభిస్తున్న అధికారులు

బి.కోడూరు, ఆగస్టు 21 : మండల పరిధిలోని మేకవారిపల్లెలో కడప పశుగణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ఉచిత పశుగర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని డీఎల్‌డీఏ కార్యనిర్వహణాధికారి జి.రమేశ్ ప్రారంభించారు. ఈ శిబిరంలో 36 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స, 14 చూడి నిర్ధారణ పరీక్షలు, 45 లేగ దూడలకు నట్టల నివారణ మందు తాపించుట, బలహీనమైన 30 పశువులకు ఎముకల పొడి పంపిణీ చేశారు. అలాగే 4 నుంచి 8 నెలల పెయ్యదూడలకు బ్రూసెల్లా వ్యాధి నివారణ టీకాలు, పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు, అలాగే పశువులకు ప్రీవ్యాక్సినేషన్ క్యాప్సుల్స్‌ను అందించారు. అలాగే రక్తపరీక్ష నమూనాలు సేకరించి వాటిని తగు మందులను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాంతీయ పశువైద్యశాల బి.మఠం వైద్యాధికారి వెంకటసుబ్బయ్య, ప్రభలవీడు పశువైద్యాధికారి లక్ష్మీనరసయ్య, శివరామిరెడ్డి, సచివాలయ పశు సంవర్ధకశాఖ సహాయకులు పాల్గొన్నారు. అనంతరం కొత్తగా ఎంపికైన పశు సంవర్ధకసహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను అరికట్టాలి



ఐక్యతా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 21: బంగ్లాదేశ్‌లో దేవాలయాలు, హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బుధవారం హిందూ ఐక్యత ర్యాలీ నిర్వహించారు. గీతాశ్రమం నుంచి పురవీధుల గుండా శివాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ, భజరంగదళ్, బీజేపీ పట్టణాధ్యక్షుడు వంకదారి నరేంద్రరావు, మల్లికార్జునరావు, గౌరీ, పుల్లారెడ్డి, మోహన్, రవితేజ పాల్గొన్నారు.

మరమ్మతుకు నోచుకోని పాపిరెడ్డిపల్లె రోడ్డు

- ఏపుగా పెరిగిన కంప చెట్లు
- ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు,పాదచారులు



అధ్వానంగా ఉన్న పాపిరెడ్డిపల్లె రోడ్డు

కాశినాయన ఆగస్టు21: రంపాడు పంచాయతీలోని ఓబుళాపురం, పాపిరెడ్డిపల్లె గ్రామాల మధ్య సరైన దారి సదుపాయంలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీలోని రెడు ప్రధాన గ్రామాల మధ్య ఉన్న అంతర్గత రోడ్డు దశాబ్దాల తరబడి మట్టిరోడ్డుగానే మిగిలిపోయింది.ఈమట్టి రోడ్డు గుంతలతో కంకరతేలింది. అంతేగాక దారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లు ఉండటంతో పాదచారులు, వాహన చోదకులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు.రంపాడు పంచాయతీ హెడ్ క్వార్టర్ అయిన పాపిరెడ్డిపల్లె గ్రామస్థులు ఓబుళాపురం గ్రామం వద్ద నిర్మించిన గ్రామ సచివాలయానికి వచ్చిపోవాలంటే ఇబ్బందులు తప్పడంలేదు. సాధారణంగా పాపిరెడ్డిపల్లె నుంచి సగిలేరు దాటుకొని ఓబుళాపురం పోవాల్సి ఉంటుంది.వీటి మధ్యదూరం కేవలం 3 కిలోమీటర్లు ఉంటుంది.ప్రస్తుతం ఈదారంతా కంపతో, కంకర తేలి మట్టి రోడ్డుతో అస్తవ్యస్తంగా ఉంది. మామూలు రోజుల్లోనే ఈదారిపై ప్రయాణం కష్టంగా ఉంటుంది. అలాంటిది ఇక వర్షం వస్తే ఈదారి మీదుగా ప్రయాణం ఎలా ఉంటుందో చెప్పక్కర్లేదు. ప్రస్తుతం ఏపనిచేయించుకోవాలన్నా గ్రామ సచివాలయానికి వెళ్లాల్సిందే. అలాంటప్పుడు దారి సదుపాయం లేకపోతే ఎలా సచివాలయానికి వెళ్లి పనులు చేయించుకోవాలని పాపిరెడ్డిపల్లె గ్రామస్థులు పలువురు ప్రశ్నిస్తున్నారు. దాదాపు 500 జనాభాఉన్న ఈగ్రామం నుంచి నిత్యం పదుల సంఖ్యలో ప్రజలు వివిధ పనులపై రైతుభరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్ సెంటర్,సచివాలయానికి వచ్చిపోతుంటారు. వీరంతా బాలరాజుపల్లె. నర్సాపురం మీదుగా లేదా పోరుమామిళ్ళ మీదుగా రెండు ఆటోలు మారి దాదాపు 11 కిలోమీటర్లు ప్రయాణించి సచివాలయం పోయి వస్తున్నారు. 3కిలోమీటర్లు దూరంలో ఉన్న సచివాలయానికి సరైన దారి సదుపాయం లేక పోవడంతోనే 11 కిలోమీటర్లు ప్రయాణంచేయాల్సి వస్తోందనిపలువురు వాపోతున్నారు. గత ప్రభుత్వ నిర్వాహకంతోనే ఈరోడ్డు అధోగతిపాలైందని కనీసం ఈకొత్త ప్రభుత్వంలోనైనా పాపిరెడ్డిపల్లె రోడ్డును తారురోడ్డుగా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

'కేజీబీవీ ఎస్‌వోను సస్పెండ్ చేయాలి'

అట్లూరు, ఆగస్టు 21 : అట్లూరు కేజీబీవీ ఎస్‌వోను వెంటనే సస్పెండ్ చేయాలంటూ భారత ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరపోగు రవి డిమాండ్ చేశారు. బుధవారం అట్లూరు తహసీల్దారు రవిశంకర్‌కు వినతిపత్రం అందించారు. కేజీబీవీలో చదువుతున్న 285 మంది పేద విద్యార్థులకు చాలీచాలని భోజనం పెడుతూ తప్పుడు రికార్డులు రాసుకుంటూ ప్రభుత్వధనాన్ని సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని, మండల అధ్యక్షుడు వంశీ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 21: మహిళపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. కోల్‌కతాలో వైద్యురాలిని అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను శిక్షించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సీఐటీయూ కార్యాలయం నుంచి రాజీవ్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. రాజీవ్ సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ముంతాజ్‌బేగం, పట్టణ కార్యదర్శి వెంకటసుబ్బమ్మ, రాములమ్మ, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, చంటి, రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: కోల్‌కతాలో హాస్పిటల్‌లో వైద్యురాలిపై హత్యాచారం చేసిన మానవమృగాలను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవప్రసాద్ అన్నారు. బుధవారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద ధర్నా చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ప్రసాద్, రవి, కిశోర్ పాల్గొన్నారు,

విద్యార్థులకు కంటి పరీక్షలు

అట్లూరు, ఆగస్టు 21 : కేబీబీవీ గురుకుల పాఠశాల విద్యార్థులకు బుధవారం అట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అమితాబేగం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి స్క్రీనింగ్ చేశారు. స్కూలులో గదులు, టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. విద్యార్థులకు ఆహారం అలవాట్లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో మురళి, మాణిక్యమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ పరిశీలన

బద్వేలు రూరల్, ఆగస్టు 21 : మండల పరిధిలోని చింతలచెరువు గ్రామంలో ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్‌ను బుధవారం సెంట్రల్ పరిశీలకులు ఇంద్రయాణి, నైటింగేల్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు హెల్త్ క్లినిక్‌లో ఉన్న రికార్డులు పరిశీలించి విధుల్లో ఉన్న సీహెచ్‌వో భవాని నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వినయ్‌కుమార్, ఏఎన్ఎం గీతా, బాల రాణి, చంద్రావతి, సీహెచ్‌వోలు మత్తిక, శుభలేఖ, సుస్మిత పాల్గొన్నారు.

మదూరు కాలువ ఆక్రమణపై జాయింట్ సర్వే



మదూరు కాలువ ఆక్రమణపై జాయింట్ సర్వేచేస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు , ఆగస్టు 21 : మదూరు కాలువ ఆక్రమణలపై మున్సిపల్, రెవెన్యూ అధికారులు కదిలారు. ఆమేరకు బుధవారం జాయింట్ సర్వేచేపట్టారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆగస్టు 17న ప్రచురితమైన మదూరు కాలువ ఆక్రమణపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, మండల సర్వేయర్ బి. వెంకటలక్ష్మి, మున్సిపల్ టౌన్ సర్వేయర్ రవి కిషోర్ జాయింట్ సర్వే చేశారు. ముఖ్యంగా హనుమాన్‌నగర్ మున్సిపల్ లిమిట్స్ నుంచి ఎక్కడెక్కడ మదూరు కాలువ ఆక్రమణలకు గురైంది ప్రాథమికంగా గుర్తించారు, అలాగే దొరసానిపల్లె,చౌటపల్లెలో మదూరు కాలువ ఆక్రమణపై కూడా వీఆర్‌వో విలేజ్ సర్వేయర్ల టీంలు సర్వేచేస్తున్నట్లు తహసీల్దారు వండాడి గంగయ్య తెలిపారు. ఆక్రమణలు గుర్తించి అక్రమ కట్టడాలకు మార్కింగ్ ఇవ్వాలని నిర్ణయించారు. ఈ జాయింట్ సర్వేలో రామేశ్వరం,దొరసానిపల్లె సర్వేయర్లు సురేంద్ర,మహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వపాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ అనూరాధ

పోరుమామిళ్ల, ఆగస్టు 21: ప్రభుత్వ పాఠశాలను డీఈవో అనూరాధ ఆకస్మిక తనిఖీ చేశారు. బుధవారం ఆమె పోరుమామిళ్లలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల గిరినగర్‌లోని ప్రాథమికపాఠశాల, కస్తుర్బాగాంధీ బాలికల పాఠశాలలను సందర్శించారు. అనంతరం గిరినగర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి ప్రాథమికోన్నతపాఠశాల మార్పుటకు ఉన్న వసతులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో బాల అంకిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

'కలమల్ల ఎస్ఐ, ఏఎస్ఐపై చర్యలు తీసుకోవాలి'

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 21: నిస్కారణంగా తనను దూషించి గాయపరిచిన కలమల్ల ఎస్ఐ తిమోతి, ఏఎస్ఐ రమణలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్టీపీపీ జూనియర్ ప్లాంట్ అసిస్టెంట్ యాకాసి అంకన్న పేర్కొన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనకు, తన భార్య ప్రియాంకకు మధ్య మనస్పర్ధలు ఉన్నాయన్నారు. భార్య ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఎస్ఐ, ఎఎస్ఐ తనను స్టేషన్‌కు పిలిపించి తిట్టి దారుణంగా కొట్టి హింసించారన్నారు. పోలీసులు కొట్టడం వలన తన కాళ్లకు గాయాలై చిటికెన వేలు విరిగిందని తెలిపారు. పోలీసు గాయాలు మానిపోవడానికి ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నానన్నారు. కానీ ఆస్పత్రిలో ఉన్న తనను ఎస్ఐ, ఏఎస్ఐ బెదిరిస్తున్నారని తెలిపారు. స్టేషన్‌కు వచ్చిన తన సోదరుడు, అతని భార్యను కూడా అసభ్య పదజాలంతో దూషించి స్టేషన్ నుంచి బయటకు తరిమివేశారన్నారు. సమావేశం మేరీ సుజీ, యేసన్న, పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

మైదుకూరు రూరల్, ఆగస్టు 21 : మైదుకూరు మున్సిపాలిటీ, మండలంలోని రైతులు 2024 ఖరీఫ్ సీజన్‌లో తమ పంటలను తప్పనిసరిగా అధికారుల వద్ద నమోదు చేయించుకోవాలని బుధవారం ఏవో లక్ష్మీప్రసన్న తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో రైతులు వేసిన పంటలను ఆమె పరిశీలించారు. రీసర్వేలో రైతులు తమ పొలాల్లో ఏదైన సమస్య ఉంటే వీఆర్వో,సర్వేయర్‌ను కలిసి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు.

మున్సిపాలిటీ స్థలం ఆక్రమిస్తే చర్యలు



దేవాంగ కల్యాణ మండపం వెనుక కాలువ పొరంబోకు స్థలంలో మున్సిపాలిటీ బోర్డు వేస్తున్న సిబ్బంది

ప్రొద్దుటూరు ,ఆగస్టు 21 : ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి చెందిన కాలువ పొరంబోకు స్థలాన్ని ఓ మాజీ కౌన్సిలర్ విక్రయించి సొమ్ముచేసుకోవడం పై ఆంధ్రజ్యోతిలో సోమవారం 'మున్సిపాలిటీ స్థలం విక్రయం' పేరుతో కథనం ప్రచురితమైంది. దీంతో కమిషనర్ రఘునాతరెడ్డి మున్సిపాలిటీ స్థలం ఆక్రమించి విక్రయాలు జరిపిన వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని, ఆస్థలంలో మున్సిపల్ బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది బుధవారం దేవాంగ కల్యాణ మండపం వెనుక వున్న మున్సిపల్ కాలువ పొరంబోకు స్థలంలో మున్సిపాలిటీ బోర్డు ఏర్పాటు చేశారు. ఈ స్థలం ఆక్రమిస్తే చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎవరైన ఈ స్థలం పై క్రయ విక్రయాలు జరిపివుంటే అవి చెల్లవని కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు.

కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు అందజేత



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, ఆగస్టు 21: జమ్మలమడుగు మండలంలోని దేవగుడి గ్రామంలో బుధవారం టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి మన టీడీపీ యాప్ యాక్టివ్‌గా పని చేసిన జమ్మలమడుగు నియోజకవర్గంలోని 30 మంది పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పంపిన ప్రశంసా పత్రాలను టీడీపీ కార్యకర్తలకు, నాయకులకు అందించినట్లు ఆయన తెలిపారు.

ఇరువర్గాలపై బైండోవర్

ముద్దనూరు ఆగస్టు21: స్థానిక ఎర్రగుంట్ల రోడ్డులోని వివాదాస్పద స్థలం వద్ద రెండు రోజుల క్రితం జరిగిన ఘర్షణకు సంబంధించి బుధవారం పోలీసులు ఇరువర్గాలపై బైండోవర్ చేశారు. కాగా ఒక వర్గానికి చెందిన 5 గురిని రూ.2లక్షలు పూచికత్తు పై బైండోవర్ చేసుకున్నట్లు తహసీల్దారు రామకుమారి తెలిపారు.

వృద్ధులను గౌరవించాలి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 21: వృద్ధులను ఆత్మీయంగా పలకరించి గౌరవంగా చూసుకోవడం మన బాధ్యత అని కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా కామనూరు ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి, విజయేశ్వరి, అమ్మానాన్న మదర్‌థెరిస్సా వృద్ధాశ్రమాలను సందర్శించి వృద్ధుల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. వృద్ధాశ్రమం నిర్వాహకులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ వరప్రసాద్, సీహెచ్‌వో క్రిష్ణమ్మ, హెల్త్ అసిస్టెంట్ సుబ్బయ్య, సీహెచ్‌వోలు దివ్య, శిరీష, ఎఎన్ఎంలు సుప్రజ, ఉమారాణి, ఆశా వర్కర్లు లక్ష్మీదేవి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

రేపు గ్రామ సభలు

చాపాడు, ఆగస్టు 21: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈనెల 23న ఆయా గ్రామ సచివాలయాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీధర్‌నాయుడు తెలిపారు. ఈ గ్రామసభల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, గ్రామ కార్యదర్శులు, గ్రామస్థులు కలిసి ప్రణాళిక తయారు చేస్తున్నట్లు తెలిపారు. చాపాడు, లక్ష్మీపేట, వెదురూరు, రాజువారిపేట, అన్నవరం, తదితర గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు.

రాజుపాలెం..: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో చేపట్టే పనులను గుర్తించేందుకు ఈ నెల 23 శుక్రవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో షాకీర్ ఆలీఖాన్ తెలిపారు .ఈ పథకం ద్వారా ప్రజలు రైతులకు అవసరమైన పనులు గుర్తిస్తామన్నారు. ఈ పనులను ఉపాధి హామీ పథకం కూలీల ద్వారా నిర్వహిస్తామన్నారు. గ్రామసభలకు సర్పంచ్‌లు, వార్డుమెంబర్లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజలు హాజరు కావాలన్నారు.

కాశినాయన..:మండలంలోని 15 పంచాయతీల్లో 23వ తేదీ నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మైథిలీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో చేపట్టాల్సిన పనులపై ఈసమావేశంలో చర్చిస్తామన్నారు. ప్రజలు సభలను జయప్రదంచేయాలని వారుకోరారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

బద్వేలు, ఆగస్టు 21 : డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరం పాటుపడదామని బద్వేలు అర్బన్ ఎస్ఐ రవికుమార్ పిలుపునిచ్చారు. డీవైఎఫ్ఐ జిల్లా సంఘం ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై ముద్రించిన పోస్టర్‌ను అర్బన్ ఎస్ఐ రవికుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, పట్టణ నాయకులు మస్తాన్ షరీఫ్, ఎస్‌కే షబ్బీర్, మహిళా కో-కన్వీనర్లు నాగలక్ష్మి, నాగేశ్వరి, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

రాజుపాలెం, ఆగస్టు 21 : మండలంలోని వెల్లాల గ్రామానికి చెందిన మేకల శాంతయ్య అనే వ్యక్తి నుంచి బుధవారం 24 మద్యంసీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడని సమాచారం రావడంతో పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వర్గీకరణ వద్దు ఐకమత్యమే ముద్దు

పోరుమామిళ్ల, ఆగస్టు 21: వర్గీకరణ వద్దు ఐకమత్యమే ముద్దు అని అంబేడ్కర్ సేన కార్యదర్శి ముత్యాల ప్రసాద్ అన్నారు. బుధవారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద సుప్రీంకోర్టు తీర్పు పునః పరిశీలించాలని నిరసన తెలిపారు. మాల, మాదిగలను రాజకీయ కుట్రలో భాగంగా బీజేపీ ప్రభుత్వం సుప్రీం కోర్టు ద్వారా కుట్రకు పాల్పడిందన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు చెంద్రాయుడు, బాబు, విజయరాములు, సురేశ్ పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగు పట్టణంలో బుధవారం రాష్ట్ర మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రామాజీ ఇమ్మానుయేల్, ఇతర మాలమహానాడు సంఘాల ఆధ్వర్యంలో భారత్ బంద్ కార్యక్రమంలో భాగంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు నిరసనగా అన్ని సంఘాల ఆధ్వర్యంలో భారత్ బంద్‌కు పిలుపునిచ్చాయన్నారు. వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని వారు ఆరోపించారు. అనంతరం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. సుమారు గంట వరకు ఆర్టీసీ డిపో నుంచి బస్సులను బయటకు పంపలేదు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, పుల్లయ్య, బాబు, మంత్రి శ్రీను, చెన్నయ్య,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు టౌన్..: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుకు నిరసనగా మాలమహానాడు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ ప్రశాంతంగా జరిగింది. బుధవారం మాలమహానాడు సంఘాల నాయకులు పాఠశాలలు, కళాశాలను, స్థానిక సంస్థలను మూసివేయించారు. ఈ సందర్భంగా మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి సాత్రి లక్షుమయ్య, మాలమహానాడు రామాజీవర్గం జిల్లా అధ్యక్షుడు ఉల్లి కిరణ్‌కుమార్, జాతీయ మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోసా మనోహర్ మాట్లాడుతూ ఎస్సీలను వర్గీకరిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు కుమార్, వెంకటయ్య, ప్రశాంత్, జ్ఞానానందం, ఏలియాపాల్గొన్నారు.

ఖాజీపేట..: ఖాజీపేటలో భారత్‌బంద్ విజయవంతమైందని రాష్ట్ర మాలమహానాడు ఉపాధ్యక్షుడు వెంకటరమణ అన్నారు.సుప్రీం కోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ ను వ్యతిరేకిస్తూ బుధవారం బస్టాండు కూడలిలో బంద్ నిర్వహించారు. అందులో ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలు, వ్యాపారస్థులు బంద్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు సాలయ్య, వసంతరావు, పుల్లయ్య, యేసన్న, శరత్, కిశోర్, గణేష్, మునిస్వామి, భాస్కర్, సుదర్శన్, ఆనంద్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండాపురం..: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన భారత్‌బంద్‌లో భాగంగా మాలమహానాడు నాయకులు బుధవారం కొండాపురం ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ ఆపాలని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు మనోహర్‌బాబు, జయంతు జయచంద్ర, చిన్నా, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జమ్మలమడుగు, ఖాజీపేట, కొండాపురంలో నిరసన తెలుపుతున్న నాయకులు